


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 47 | శుక్రవారం 17 జులై , 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## గ్రేటర్‌లో మొదలైన ఆషాఢ బోనాల సంబురాలు..
# శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్

- హైదరాబాద్‌లో వైభవంగా ప్రారంభమైన ఆషాఢ బోనాలు
- ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి
- ఉత్సవాల నిర్వహణకు రూ. 20 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు

జులై 16 వార్త సాక్ష్యం

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ ఎంసీ) పరిధిలోని వేలాది ఆలయాల్లో ఆషాఢ బోనాల జాతర కోలాహలంగా ప్రారంభమైంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు, భక్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



## ఓట్లు వేయలేదనే కక్షతోనే సీతారామ
# ప్రాజెక్ట్‌ను గాలికి వదిలేశారు



జులై 16 వార్త సాక్ష్యం

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఎప్పుడూ సరిగా ఆదరించడం లేదనే కక్షతోనే... ఆ జిల్లాకు అత్యంత కీలకమైన సీతారామ ప్రాజెక్టుతో పాటు పలు నీటి పారుదల ప్రాజెక్టులను గత పాలకులు గాలికి వదిలేశారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి ఆయన ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. -మిగతా 2లో

# హోర్ముజ్ టోల్ ఫీజు..
## ట్రంప్ మనసు మార్చిన గల్ఫ్ దేశాలు!

జులై 16 వార్త సాక్ష్యం

హోర్ముజ్ జలసంధి మీదుగా సరకు రావాణపై 20 శాతం టోల్ ఫీజు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించడం ప్రపంచాన్ని నివ్వెరపరిచిన విషయం తెలిసిందే. అయితే, టోల్ ప్రతిపాదనపై ట్రంప్ 24 గంటల వ్యవధిలోనే వెనక్కు తగ్గారు. టోల్ విషయమై ఆయన మనసు మార్చడంలో గల్ఫ్ దేశాలు ముఖ్యపాత్ర పోషించినట్టు -మిగతా 2లో



# ఇస్రోలో వరుస రాజీనామాలు..
# రంగంలోకి దిగిన కేంద్రం

- కీలక మిషన్ల శాస్త్రవేత్తల రాజీనామాల పై కేంద్రం కఠిన నిర్ణయం
- శాస్త్రవేత్తల రాజీనామాలు ఇక సాధారణంగా ఆమోదించ వద్దని ఆదేశం
- తుది నిర్ణయం అంతరిక్ష శాఖే తీసుకోనుందంటూ అంతర్గత మెమో
- ఇస్రోలో 100-120 మంది వరకు రాజీనామా చేసినట్లు సమాచారం
- కీలక ప్రాజెక్టుల పై ప్రభావం పడకుండా చర్యలు చేపట్టిన కేంద్రం
- పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొంటామన్న ఇస్రో ఛైర్మన్ నారాయణన్



# హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు
# గుడ్ న్యూస్.. రానున్న అదనపు కోచ్‌లు

- హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1లో అదనపు కోచ్‌ల ఏర్పాటు
- ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు హెచ్ఎంఆర్ఎల్ కీలక నిర్ణయం
- కోచ్‌ల కొనుగోలుకు చర్చలు జరపాలని అధికారులకు ఆదేశం
- రద్దీ స్టేషన్లలో క్రౌడ్ మేనేజ్‌మెంట్ పై ప్రత్యేక దృష్టి



## అమరావతిలో జగన్నాథ రథయాత్ర.. బంగారు చీపురుతో ఊడ్చి సేవ చేసిన సీఎం చంద్రబాబు




- రాజధాని అమరావతిలో తొలిసారిగా జగన్నాథ రథయాత్ర
- బంగారు చీపురుతో ఊడ్చి రథాన్ని లాగిన సీఎం చంద్రబాబు
- ఆధ్యాత్మికతతోనే ఒత్తిడి దూరం అవుతుందన్న ముఖ్యమంత్రి
- రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని ప్రకటన

## ఆంధ్రప్రదేశ్ మీకు క్షమాపణ చెప్పాలి: గల్లా జయదేవ్‌ను
# ఉద్దేశించి మంత్రి నారా లోకేశ్ పోస్ట్

జులై 16 వార్త సాక్ష్యం

తెలంగాణలో అమరరాజా గ్రూప్ సరికొత్త తయారీ కేంద్రాన్ని (గిగా ఫ్యాక్టరీ) ప్రారంభిస్తున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ ఆ సంస్థకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరరాజా సంస్థ ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా ఒక ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. అమరరాజా అధినేత, మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌కు ఆయన బహిరంగంగా క్షమాపణలు చెప్పడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం గా మారింది.



VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శుక్రవారం 17 జూలై, 2026

## గ్రేటర్‌లో మొదలైన ఆషాఢ బోనాల సంబురాలు.. శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు, భక్తులకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గురువారం నాడు హైదరాబాద్‌లో ఈ వేడుకలు ఘనంగా అంకురార్పణ చేసుకున్నాయి. బోనాల పండుగ సామాజిక ఐక్యతకు నిదర్శనమని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 కోట్లను కేటాయిం చిందని ఆయన వెల్లడించారు. ఆలయ ప్రాంగణాల్లో పారిశుధ్యం, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సేవలతో పాటు పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. మహంకాళి అమ్మవారికి అంకితం చేసే ఈ బోనాల ఉత్సవాలను దేవాదాయ శాఖ పరిధిలోని 3 వేలకు పైగా ఆలయాల్లో అత్యంత వైభవంగా నిర్వహించను న్నారు. ఆగస్టు మధ్య వరకు ఈ వేడుకలు కొనసాగనున్నాయి. భక్తులం దరూ భక్తిశ్రద్ధలతో ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ముఖ్యమంత్రి కోరారు. భారీ సంఖ్యలో తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో అధికారులు ఇప్పటికే సమీక్షలు నిర్వహించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ ఏడాది పలు ఇతర మున్సిపల్ కార్పొరేషన్లకు కూడా ఈ ఉత్సవాలను విస్తరించడం విశేషం.

## హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు గుడ్ న్యూస్.. రానున్న అదనపు కోచ్‌లు

హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) శుభవార్త అందించింది. నగరంలో మెట్రో రైళ్లలో పెరుగుతున్న రద్దీని తగ్గించేందుకు ఫేజ్-1 నెట్‌వర్క్‌లో అదనపు కోచ్‌లను చేర్చాలని నిర్ణయించింది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండే స్టేషన్లలో ప్రయాణికులకు వెసులుబాటు కల్పించేలా ఈ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం 69 కిలోమీటర్ల మేర ఉన్న ఫేజ్-1 కారిడార్‌లో మూడు కోచ్‌లతో కూడిన రైళ్లు నడుస్తున్నాయి. అయితే, ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఈ కోచ్‌లు సరిపోవడం లేదు. అమీర్‌పేట్, మియాపూర్, రాయదుర్గం, హైటెక్ సిటీ వంటి కీలక స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో, కొత్త కోచ్‌ల కొనుగోలు నిమిత్తం తయారీదారులతో వెంటనే చర్చలు ప్రారంభించాలని హెచ్‌ఎంఆర్‌ఎల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి బుధవారం అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల సేవలు, మౌలిక వసతులపై జరిపిన సమీక్ష అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. కోచ్‌ల పెంపుతో పాటు స్టేషన్ల వెలుపల రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంపై అధికారులు దృష్టి సారించారు. ఫస్ట్, లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం టీఎస్‌ఆర్టీసీ, రవాణా శాఖతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే, పాదచారుల రాకపోకలను సులభతరం చేయడం, మెట్రో స్టేషన్లకు అనుసంధానంగా ఉన్న స్కైవాక్‌ల నిర్వహణ, రద్దీ నియంత్రణకు వినూత్న వ్యూహాలను అమలు చేయాలని నిర్ణయించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు, భద్రతతో పాటు స్టేషన్ల పరిశుభ్రతకు తమ మొదటి ప్రాధాన్యత ఉంటుందని హెచ్‌ఎంఆర్‌ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్ తెలిపారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ఐటీ హబ్‌లను కలుపుతూ పబ్లిక్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఏర్పాటు ప్రతిపాదనను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

## డీలిమిటేషన్‌తో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదు

వికసిత భారత్ - 2047 లక్ష్యంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ వెల్లడించారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడారు. దేశంలో అభివృద్ధి, సంస్కరణల ఎజెండాపై సభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా ప్రతినిధిగా 25 ఏళ్లు పూర్తయ్యాయని గుర్తు చేశారు. ఇది అభివృద్ధి పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా నుంచి ఆత్మనిర్భర్ భారత్ వరకు చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో వారి సాధికారతకు ఊతం అవుతుందని బీజేపీ ఎంపీ చెప్పారు. మహిళా బిల్లుతోపాటు డీలిమిటేషన్‌ను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని విమర్శించారు. డీలిమిటేషన్‌తో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని స్పష్టం చేశారు. ప్రస్తుత సీట్లు తగ్గకుండా 50 శాతం వరకు పెంపునకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. ఒకే దేశం - ఒకే ఎన్నిక దేశ ప్రయోజనాల కోసమేనని తెలిపారు. అవినీతి నిరోధక చట్టాలకు మద్దతు ఇవ్వాలని ప్రతిపక్షాలకు ఆయన సూచించారు. జేపీసీ నివేదిక తర్వాత కీలక బిల్లులపై ముందడుగు పడుతుందని ఎంపీ లక్ష్మణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు, మహిళలు, యువత అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలోని పెండింగ్ ప్రాజెక్టులపై పార్లమెంట్‌లో స్వరం వినిపిస్తామని అన్నారు. తెలంగాణకు కేంద్రం భారీగా నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులు ఇచ్చిందని ఆయన వివరించారు. ఈ వర్షాకాల సమావేశాల్లో సభను అడ్డుకోవద్దని.. చర్చల్లో పాల్గొనాలని ప్రతిపక్షాలకు ఆయన స్పష్టం చేశారు. దేశ ప్రయోజనాలే అందరికీ అత్యున్నత ప్రాధాన్యత కావాలని తెలిపారు. వర్షాకాల సమావేశాలు దేశాభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు.

# ఓట్లు వేయలేదనే కక్షతోనే సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికి వదిలేశారు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి ఆయన ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేయలేదనే కోపంతో... గిరిజనులు అధికంగా ఉండే కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు లైఫ్ లైన్ లాంటి సీతారామ ప్రాజెక్ట్‌కు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని పొంగులేటి ఆరోపించారు. ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన బీఆర్‌ఎస్ పెద్దలు కడుపులో విషం పెట్టుకుని, అబద్ధాలు ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో ప్రజల కష్టాలను గుర్తించని నాటి నాయకులు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో చూసి జ్ఞానం తెచ్చుకోవాలని హితవు పలికారు. "గత ప్రభుత్వం కట్టిందని మేము ఏ ప్రాజెక్ట్‌ను వదిలేయం. ఎటువంటి భేషజాలకు, పట్టుదలకు పోకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం. సీతారామతో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కూడా పునరుద్ధరించే తపనతో పనిచేస్తున్నాం" అని మంత్రి స్పష్టం చేశారు. దివంగత రాజశేఖర రెడ్డి హయాంలో ప్రాజెక్ట్‌లకు మహర్దశ పట్టినట్లే, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దశలవారీగా నీటి పారుదల రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత పాలకులు ఉన్న నిధులన్నీ కొల్లగొట్టినా... కాంగ్రెస్ ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేస్తూ ఒకవైపు సంక్షేమ పథకాలను, మరోవైపు ప్రాజెక్టులను నడిపిస్తోందని పొంగులేటి వివరించారు. గతంలో ఈ సీతారామ ప్రాజెక్ట్‌కు కేవలం రూ. 115 కోట్లు మాత్రమే ఖర్చు చేసి వదిలేశారని... కానీ ఇప్పుడు తమ ప్రభుత్వం నిధులిచ్చి, 1,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఖమ్మం, వైరా, సత్తుపల్లి తదితర ప్రాంతాల తాగునీటి అవసరాలను తీరుస్తోందని చెప్పారు. దీని ద్వారా ప్రస్తుతం 1.25 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తూ కరవు నుంచి రైతులను కాపాడుతున్నామని, అవసరమైతే అదనంగా కూడా నీటిని విడుదల చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం గట్టిగా పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

# ఇస్రోలో వరుస రాజీనామాలు.. రంగంలోకి దిగిన కేంద్రం!

ఇస్రోలో కీలక ప్రాజెక్టుల పై పనిచేస్తున్న శాస్త్రవేత్తలు వరుసగా రాజీనామాలు చేస్తున్న నేపథ్యంలో కేంద్ర అంతరిక్ష శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గగన్‌యాన్‌తో పాటు ఇతర ప్రధాన మిషన్లలో ఉన్న శాస్త్రవేత్తల స్వచ్ఛంద పదవీ విరమణ, రాజీనామాల పై కఠిన నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చింది. జులై 14న విడుదల చేసిన అంతర్గత మెమో ప్రకారం.. గగన్‌యాన్, ఇతర కీలక ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న గ్రూప్-ఏ శాస్త్ర, సాంకేతిక సిబ్బంది రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తులను ఇకపై సాధారణంగా ఆమోదించరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు అలాంటి అభ్యర్థనలను కేంద్రాల డైరెక్టర్లు ఆమోదించకుండా, తమ సిఫార్సులతో పాటు అంతరిక్ష శాఖకు పంపాలని ఆదేశించింది. తుది నిర్ణయం మంత్రిత్వ శాఖే తీసుకోనుంది. ఇస్రోలో ఇటీవల రాజీనామాలు పెరిగిన విషయాన్ని పరోక్షంగా అంతరిక్ష శాఖ గుర్తించింది. అయితే ఎంతమంది వెళ్లారనే అధికారిక వివరాలు వెల్లడించలేదు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా'తో మాట్లాడిన ఇస్రో వర్గాల ప్రకారం కనీసం 100 నుంచి 120 మంది వరకు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. వారిలో యూఆర్‌ఎస్‌సీ నుంచి సుమారు 80 మంది, వీఎస్‌ఎస్‌సీ నుంచి కనీసం 20 మంది ఉన్నట్లు సమాచారం. ఎల్‌వీఎం-3 ప్రాజెక్ట్ డైరెక్టర్ విక్టర్ జోసెఫ్, స్పాడెక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో పాటు చంద్రయాన్-3లో కీలకంగా పనిచేసిన ఓ యువ శాస్త్రవేత్త కూడా రాజీనామా చేసినట్లు వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాలపై ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ స్పందించారు. రాజీనామాలు జరుగుతున్న మాట వాస్తవమేనని, అయితే ప్రతి సంస్థలో ఇలాంటి పరిస్థితులు ఉంటాయన్నారు. కీలక ప్రాజెక్టులకు ఒక్కసారిగా అంతరాయం కలగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా వెళ్లినా వారి బాధ్యతలను మరొకరు చేపడతారని, పరిస్థితిని ఇస్రో సమర్థంగా నిర్వహిస్తోందని వెల్లడించారు. ఇస్రోలో మొత్తం 14,600 మందికి పైగా ఉద్యోగులు ఉన్నప్పటికీ, రాజీనామాలు చేసినవారిలో కీలక మిషన్లకు చెందిన అనుభవజ్ఞులు ఉండటమే ఆందోళన కలిగిస్తోంది. చంద్రయాన్-3లో ల్యాండింగ్ ప్రక్రియ ధ్రువీకరణకు అవసరమైన లక్షకు పైగా పరీక్షలు నిర్వహించి, దాదాపు 25 టెరాబైట్ల డేటాను సిద్ధం చేసిన ప్రాజెక్ట్ మేనేజర్ ఆదిత్య రాళ్లపల్లి కూడా సంస్థను వీడినట్లు సమాచారం. 2020లో జారీ చేసిన నిబంధనల ప్రకారం గ్రూప్-ఏ శాస్త్ర, సాంకేతిక సిబ్బంది రాజీనామాలను సంబంధిత కేంద్రాల డైరెక్టర్లే ఆమోదించే అధికారం ఉండేది. తాజా ఆదేశాలతో గగన్‌యాన్, ఇతర ప్రధాన మిషన్లలో పనిచేసే శాస్త్రవేత్తల విషయంలో ఆ అధికారాన్ని వెనక్కి తీసుకుంది. ఖాళీలను భర్తీ చేయడం కంటే అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలను భర్తీ చేయడం అంత సులభం కాదనే అభిప్రాయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తాజా ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి.

# హోర్ముజ్ టోల్ ఫీజు.. ట్రంప్ మనసు మార్చిన గల్ఫ్ దేశాలు

టోల్ విషయమై ఆయన మనసు మార్చడంలో గల్ఫ్ దేశాలు ముఖ్యపాత్ర పోషించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. వాస్తవానికి టోల్ ఫీజు వద్దని ట్రంప్ సలహాదారులు పదే పదే వారించినట్టు తెలిసింది. ఇది అమెరికా ప్రయోజనాలకే చేటు చేస్తుందని వారు హెచ్చరించారు. ఈ చర్యలతో ఇరాన్ వాదనలకు బలం చేకూరడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరుగుతాయని వార్నింగ్ ఇచ్చారు. కానీ ట్రంప్ మాత్రం వెనక్కు తగ్గలేదు. టోల్ విధిస్తున్నామని ట్రంప్ ప్రకటించడంతో గల్ఫ్ దేశాల్లో ఒక్కసారిగా కలకలం రేగినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్ దేశాలు వెంటనే రంగంలోకి దిగి టోల్ విషయంలో ట్రంప్ వెనక్కు తగ్గేలా చేశాయి. యూఎస్‌లో పెట్టుబడులను పెంచేందుకు గల్ఫ్ దేశాలు అంగీకరించడంతో ట్రంప్ కూడా కాస్త మెత్తబడ్డట్టు సమాచారం. గల్ఫ్ దేశాలు అమెరికాలో భారీగా పెట్టుబడులు పెట్టనున్నట్టు ట్రంప్ స్వయంగా తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో వెల్లడించారు.

ఇరాన్ సెటైర్లు..

హోర్ముజ్‌లో ట్రాఫిక్‌కు సంబంధించి తాము టోల్ వసూలు చేయదలిచినట్టు ఇరాన్ ఎప్పటి నుంచో చెబుతోంది. ఈ నేపథ్యంలో టోల్ వసూలు చేస్తామన్న ట్రంప్ ప్రకటనను తమకు అనుకూలంగా మార్చుకోవడంతో పాటు సెటైర్లు కూడా పేల్చింది. 'అమెరికా అధ్యక్షుడు 100 శాతం కరెక్ట్. హోర్ముజ్ జలసంధిలో భద్రత కల్పించే వారు కచ్చితంగా టోల్ వసూలు చేయాల్సిందే. ఈ సేవలు అందించిన వారికి పారితోషికం లభించాల్సిందే. కానీ 20 శాతం ఫీజు మాత్రం కాస్త ఎక్కువనే చెప్పాలి. మేమైతే ఇంత వసూలు చేయము. న్యాయంగా ఉంటాము' అని ఇరాన్ సెటైర్లు పేల్చింది.

## అమరావతిలో జగన్నాథ రథయాత్ర.. బంగారు చీపురుతో ఊడ్చి సేవ చేసిన సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తొలిసారిగా జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ యాత్రలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూరీలో నిర్వహించే సంప్రదాయ క్రతువు తరహాలో రథం ముందు భాగాన్ని బంగారు చీపురుతో ఊడ్చి శుభ్రం చేసి చంద్రబాబు తన సేవను చాటుకున్నారు. అనంతరం జగన్నాథుడు, బలభద్ర, సుభద్రలు ఆశీనులైన రథాన్ని తాడుతో లాగి యాత్రను ప్రారంభించారు. ఈ మహోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి పి.నారాయణ, స్థానిక శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, వేలాదిగా భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. ఈ సందర్భంగా, అమరావతి బృహత్ ప్రణాళిక చిత్రపటాన్ని శిరస్సుపై ధరించి, రాజధాని నగరం విశ్వనగరంగా ఎదగాలని ఆయన జగన్నాథ స్వామిని ప్రార్థించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. దేశంలో పూరీ జగన్నాథ రథయాత్రకు ఎంతో విశిష్టత ఉందని, అందరూ అక్కడికి వెళ్లలేరని, అలాంటిది తొలిసారిగా అమరావతిలో ఈ యాత్ర నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. ఈ యాత్రలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. ఇకపై ప్రతిఏటా అమరావతిలో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తామని ఇస్కాన్ ప్రకటించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇస్కాన్, అక్షయపాత్ర ఫౌండేషన్‌లు అందిస్తున్న సేవలను చంద్రబాబు కొనియాడారు. దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో 25 వేలకు పైగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షయపాత్ర నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోందని తెలిపారు. ప్రపంచంలోనే ఇంత పెద్ద ఎత్తున 500 కోట్ల మందికి ఆహారం అందించడం అరుదైన విషయమని ప్రశంసించారు. ఏపీలో 10 సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా రోజూ 1.80 లక్షల మంది విద్యార్థులకు భోజనం అందిస్తున్నట్లు వివరించారు. ఆధునిక జీవనశైలి వల్ల ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావిస్తూ, మానవ సంబంధాలు తగ్గి సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం కుటుంబాలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా కొన్ని కుటుంబాల్లో ఆత్మహత్యలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, జీవితాల్లో ఒత్తిడిని దూరం చేసుకోవాలంటే ఆధ్యాత్మికత ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. "మైక్రో ఫ్యామిలీలు కాదు, ఉమ్మడి కుటుంబాలు కావాలి. అదే మన భారతీయ సంప్రదాయం" అని ఆయన పిలుపునిచ్చారు. సమాజం ప్రశాంతంగా ఉండటానికి దేవాలయాలు దోహదపడతాయని, అందుకే రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాలను నిర్మించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. భారతీయ సంస్కృతిని కాపాడేందుకు ఇస్కాన్ వంటి సంస్థలతో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేసి రాష్ట్ర ప్రజలకు మేలు చేయడమే తమ ప్రభుత్వ సంకల్పమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. జగన్నాథ రథయాత్ర తలపెట్టగానే అమరావతిలో వర్షం కురిసి వాతావరణం చల్లబడటం శుభసూచకమని అన్నారు. ఆ జగన్నాథ స్వామి కృప రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్ మీకు క్షమాపణ చెప్పాలి: గల్లా జయదేవ్‌ను ఉద్దేశించి మంత్రి నారా లోకేశ్ పోస్ట్

జగన్ హయాంలో సొంత రాష్ట్రంలోనే ఎంతో ఆదరణ, ప్రోత్సాహం దక్కాల్సిన అమరరాజా వంటి దిగ్గజ సంస్థ తీవ్ర వేధింపులకు గురైందని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వేధింపుల కారణంగానే ఆ సంస్థ ఏపీ వదిలి పక్క రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. "గత ప్రభుత్వ దుందుడుకు చర్యల వల్ల జరిగిన నష్టానికి గానూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మీకు క్షమాపణ చెప్పాలి" అంటూ అమరరాజా సంస్థ అధినేత, మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌ను ఉద్దేశించి లోకేశ్ బహిరంగంగా క్షమాపణలు కోరారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలో ఆంధ్రప్రదేశ్ మళ్లీ పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా మారిందని లోకేశ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో అమరరాజా గ్రూప్ చేపట్టబోయే విస్తరణ పనుల్లో ఆంధ్రప్రదేశ్ మళ్లీ కీలక పాత్ర పోషించాలని, ఇక్కడ మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆయన ఆకాంక్షించారు. "జయదేవ్ గల్లా, ఆంధ్రప్రదేశ్ మీకు క్షమాపణ చెప్పి తీరాలి. గత నాలుగు దశాబ్దాలుగా అమరరాజా, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక విజయగాథల్లో ఒకటిగా మాత్రమే నిలవలేదు. అది మన రాష్ట్రానికి అంతకుమించి ఎంతో చేసింది. ప్రపంచ స్థాయి తయారీ పరిశ్రమను సృష్టించింది, వేలాది మందికి ఉద్యోగాలు కల్పించింది, చిత్తూరు జిల్లా పేరును, ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా నిలబెట్టింది. గత ప్రభుత్వ హయాంలో మీ సంస్థ ఎదుర్కొన్న వేధింపులు నిజంగా జరగకూడనివి. సొంత రాష్ట్రంలో పరిశ్రమ పెట్టి, అభివృద్ధి చేయాలనుకున్న ఒక పారిశ్రామికవేత్తకు ప్రోత్సాహం లభించాలి కానీ, బెదిరింపులు కాదు. ఆంధ్రప్రదేశ్‌లో పుట్టిన ఒక కంపెనీ, తన తదుపరి వృద్ధి కోసం మన రాష్ట్ర సరిహద్దులు దాటి చూడాల్సి రావడం నన్ను వ్యక్తిగతంగా ఎంతో బాధిస్తోంది. మేము ప్రజల నమ్మకాన్ని తిరిగి నిలబెడుతున్న ఈ తరుణంలో, నేను మీకు ఒక విషయం స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను: ఆంధ్రప్రదేశ్ మరోసారి పరిశ్రమలకు, వ్యాపారాలకు అనుకూలమైన రాష్ట్రంగా మారింది. అమరరాజా ప్రస్థానంలో అతిపెద్ద, అత్యంత విజయవంతమైన అధ్యాయాలు దాని ప్రయాణం ప్రారంభమైన ఈ రాష్ట్రంలోనే లిఖించబడతాయని నేను ఆశిస్తున్నాను.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శుక్రవారం 17 జూలై, 2026

# గంజాయి కట్టడికి ప్రజల సమాచారమే కీలకం

-కర్లపాలెంలో నలుగురు అరెస్ట్.. 500 గ్రాముల గంజాయి స్వాధీనం



బాపట్ల జులై 16 వార్త సాక్ష్యం

కర్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలను అరికట్టేందుకు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాపట్ల డీఎస్పీ చంద్రమౌళి కేసు వివరాలను వెల్లడించారు. ఎస్సై రవీంద్రకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు జగనన్న కాలనీలోని ఎంపీఎఫ్‌సీ గోదాముల ప్రాంతంలో దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 500 గ్రాముల గంజాయి, ఎనిమిది గంజాయి ప్యాకెట్లు, రూ.1,000 నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఒక మహీంద్రా జీప్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిని మున్నంగి మణికంట (23), పొన్నపల్లి రోషన్, ఖాజా కేశవ శ్రీరామ్, గోనతోటి సుధాకర్‌లుగా గుర్తించగా, వీరిపై గతంలో కూడా పలు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు.గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు యువత, ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు ఎవరితో తిరుగుతున్నారు, వారి రోజువారీ ప్రవర్తనలో ఏవైనా మార్పులు ఉన్నాయా, చదువుతో పాటు వారి స్నేహ వర్గం ఎలా ఉందనే అంశాలపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాల్సిన అవసరం ఉందని సూచించారు. సమాజంలో గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా లేదా విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తుల గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేస్తే నేరస్తులను త్వరగా పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు, మీడియా, పోలీసుల సమిష్టి సహకారంతోనే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని, దీంతో మరింత మంది యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడవచ్చని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చినట్లు అధికారులు తెలిపారు.

# కార్యకర్తకు అండగా ఎమ్మెల్యే



గురజాల జులై 16 వార్త సాక్ష్యం

గురజాల మండలంలోని పార్టీ చెందిన వ్యక్తి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరిని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, యువనేత యరపతినేని నిఖిల్ పరామర్శించారు. ఆస్పత్రికి వెళ్లిన వారు బ్రహ్మం చౌదరి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు.అనంతరం వైద్య బృందంతో మాట్లాడిన ఎమ్మెల్యే, ప్రస్తుతం అందిస్తున్న చికిత్స వివరాలను తెలుసుకున్నారు. బ్రహ్మం చౌదరి వైద్యుల నిరంతర పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని, ఆయన ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని వైద్యులు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, బ్రహ్మం చౌదరి త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు. యువనేత యరపతినేని నిఖిల్ కూడా ఆయన త్వరితగతిన కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ నాయకుడిని పరామర్శించి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించడం ద్వారా ఎమ్మెల్యే తన మానవీయతను చాటుకున్నారు. బ్రహ్మం చౌదరి త్వరగా కోలుకోవాలని కార్యకర్తలు, అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# మెడికల్ క్యాంప్ కి విశేష స్పందన : డాక్టర్ ఆంజనేయులు






ఆత్మకూరు జులై 16 వార్త సాక్ష్యం

ప్రతిఒక్కరూ ఆరోగ్య పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించుకొని ఆరోగ్యంగా ఉండాలని తన నియోజకవర్గ ప్రజల సంక్షేమమే బుడ్డా రాజశేఖర్ రెడ్డి లక్ష్యమని కర్నూలు శ్రీ చక్ర హాస్పిటల్ వైద్యులు ఆంజనేయులు తెలిపారు..ఈ సందర్భంగా శ్రీశైలం శాసనసభ్యులు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా బృందం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని 5 వ వార్డ్ నీలతోట్ల ఏరియాలోని ఖాజామోదీన్ ఇంటి దగ్గర మెడికల్ క్యాంప్ నీ ముఖ్య అతిధులుగా హాజరై ప్రారంభించారు.ఈ క్యాంప్ లో గుండెకి సంబందించిన ఈసీజీ , 2డి ఈ సి హెచ్ ఓ పరీక్షలు కంటికి సంబందించిన పరీక్షలు ఎముకల వ్యాధి సమస్యలకు పరీక్షలు నిర్వహించారు. ఈ యొక్క క్యాంప్ లో దాదాపు 200 మంది హాజరయ్యారు. పస్పిల్ మున్నా మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ ద్వారా శ్రీ చక్ర హాస్పిటల్ వారు సేవలు అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. హాస్పిటల్ చైర్మన్ విజయకుమార్ రెడ్డి నీ అభినందించారు. ప్రతిఒక్కరు షూగర్ బీపీ వ్యాధిగ్రస్తులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి గుండె పరీక్షలు చేయించుకోవాలి అన్నారు. అన్ని రకాల పరీక్షలు చేసి సంబంధిత వ్యాధి గ్రస్తులకు మందులు పంపిణీ చేశారు. క్యాంప్ నిర్వహించి మందులు పంపిణీ చేయించిన శ్రీశైలం ఎమ్మెల్యే.బుడ్డా రాజశేఖర్ రెడ్డి ని కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో 6 వ వార్డ్ అధ్యక్షుడు ఖాజమొహిద్దిన్, 79బూత్ కన్వీనర్ ఆసిఫ్ బేగ్, తైక్వాండో గౌరవ అధ్యక్షులు నాయభ్. సయ్యద్. అసదుల్లాసాదిక్ మేనేజర్. రాజేష్, ధర్మేంద్ర, ఈసీజీ టెక్నీషియన్ లక్ష్మి పార్వతి, కంటి వైద్య నిపుణులు ఫజిల్ రెహమాన్,సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిబాపూలే వసతి గృహాన్ని తనిఖీ






-జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు

ఆత్మకూరు జులై 16 వార్త సాక్ష్యం

మహాత్మ జ్యోతిబాపూలే బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా గురువారం జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్లు నాగరాజు తనిఖీ చేశారు ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వసతి గృహంలో మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఉపాధ్యాయులు పిల్లలతో స్నేహపూర్వకంగా మెలగాలని వసతి గృహం పరిసర ప్రాంతాల శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు మెనులో ఏమైనా అవకతవకలు జరిగిన జిల్లా కలెక్టర్ కి విద్యార్థి చేస్తానని ఆయన హెచ్చరించారు పిల్లలు కూడా ఉపాధ్యాయులు చెప్పినటువంటి సూచనలను పాటించి ఆటలు యందు ప్రావీణ్యత చూపించి పాఠశాలకు తల్లిదండ్రులకు ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో విద్య పోగు ప్రసాదు పాల్గొన్నరు.

# నంద్యాల దస్తావేజు లేఖరుల పెన్ డౌన్ (సమ్మె)


- జిల్లా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు షేక్. ఫరూక్, తోడేటి రమేష్




నంద్యాల జులై 16 వార్త సాక్ష్యం

జిఓ ఎంఎస్ నెంబర్ 396 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన రిజిస్ట్రేషన్ శాఖ ప్రవేటీకరణకు నిరసనగా ఈ నెల 20వ తేదీ నుండి 31 వరకు తమ పనులకు స్వస్థి పలికి పెన్ డౌన్ చేయాలని నంద్యాల జిల్లా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు షేక్. ఫరూక్, తోడేటి రమేష్ లు గురువారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటీకరణ వల్ల ప్రజల ఆస్తులకు భద్రత కోల్పోవడమే కాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖరుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది దస్తావేజు లేఖర్ల జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందనీ, ఈ విషయమై రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖరులు నిరసనలు, సమ్మెలు, పెన్ డౌన్ ల రూపములో ఎన్ని చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యావత్తు దస్తావేజు లేఖర్లు తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అలాగే ప్రైవేటీకరణను నిరసిస్తూ జిఓ ఎంఎస్ నెంబర్ 396 ను రద్దుచేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది దస్తావేజు లేఖర్ల జీవన భృతిని కాపాడాలని వారు డిమాండు చేశారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న (10) పది సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల పరిధిలోని దస్తావేజు లేఖర్లు అందరూ పెన్ డౌన్ ప్రకటించడమైనది కాబట్టి ప్రజలందరూ సహకరించవలసిందిగా వారు కోరారు.

# ఆత్మకూరులో నియోజకవర్గస్థాయి అమరావతి ఛాంపియన్ క్రీడలు ప్రారంభం





-జిల్లా క్రీడాభివృద్ధి శాఖ ఎం ఎన్ వి రాజు
ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పసిఫిల్ మున్నా
-శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా అమరావతి క్రీడ వాల్ పోస్టర్ విడుదల




ఆత్మకూరు జులై 16 వార్త సాక్ష్యం

ఈనెల 24,25,వ తేదీలలో ఆత్మకూరు కేవీకే స్టేడియం లో జరిగే నియోజకవర్గ స్థాయి స్టేజ్ - 1 అమరావతి ఛాంపియన్షిప్ క్రీడా సెలెక్షన్ క్రీడలకు ముఖ్య అతిథిగా శ్రీశైల నియోజకవర్గం ఎమ్మెల్యే. బుడ్డా రాజశేఖర్ రెడ్డి ని జిల్లా క్రీడాభివృద్ధి శాఖ గురువారం అధికారి ఆహ్వానం పలికారు ముందుగా వెలుగోడు మండల పరిధిలోని వేల్పనూరు గ్రామంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి నివాసం లో అమరావతి క్రీడ కరపత్రలు ఆవిష్కరణ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా,జూనియర్ కాలేజ్ లెక్చరర్ అబ్దుల్ జబ్బార్,ఖోఖో కోచ్ మహబూబ్, తైక్వాండో కోచ్ ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# రాయిచేడ్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

**-పరిశీలించిన జిల్లా కలెక్టర్ హెమంత కేశవ్ పాటిల్**

జులై 16 వార్త సాక్ష్యం

ఉప్పునుంతల మండల పరిధిలోని రాయిచేడ్ గ్రామంలో మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ హెమంత కేశవ్ పాటిల్ గురువారం లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇంటిని సందర్శించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సహాయం, నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు, నిధుల వినియోగం తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి నిర్ణీత గడువులోగా లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను సక్రమంగా వినియోగించుకుని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని స్పష్టం చేసిన కలెక్టర్, పునాది నుంచి పైకప్పు వరకు ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, నిర్మాణ సామగ్రి నాణ్యంగా ఉండేలా చూడడంతో పాటు పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించి పనుల్లో జాప్యం లేకుండా చూడాలని కలెక్టర్ సూచిం చారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ





పథకాల ఫలాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపించి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని, నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు అధికారులు తరచూ గ్రామాలను సందర్శిస్తూ పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీఓ యాదగిరి, గ్రామ సర్పంచ్, మండల స్థాయి అధికారులు తదితరులు ఉన్నారు

# యాక్షన్ ప్లాన్ ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి

**-క్షేత్రస్థాయిలో పరిశీలించి.. పనుల్లో వేగం పెంచాలి**

**-మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం చేయాలి**

**-జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్**

జులై 16 వార్త సాక్ష్యం

యాక్షన్ ప్లాన్ ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని,నిర్మాణాల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి,పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాల పురోగతి,వన మహోత్సవంపై గృహనిర్మాణ శాఖ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, అధికారులతో జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని సిరిసిల్ల,వేములవాడ మున్సిపాలిటీలతో పాటు అన్ని మండలాల వారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు మంజూరు చేసిన గృహాలు, వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న వివరాలతో పాటు, పూర్తయిన ఇండ్ల వివరాలను గృహ నిర్మాణ శాఖ అధికారులు,ఎంపీడీఓ లు కలెక్టర్ కు తెలిపారు.ఇండ్లు లేని పేదల కలలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేస్తుందని తెలిపారు. గుడిసెలు, రేకుల షెడ్లలో నివసిస్తున్న వారికి పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని అన్నారు.దశల వారీగా ప్రగతిలో ఉన్న ఇండ్లను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓ లు,ఏఈ లు ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించి, లబ్ధిదారులు ఇండ్లను వేగవంతంగా పూర్తి చేసేలా దిశానిర్దేశం చేయాలని ఆదేశించారు.రోజూ వారీగా ఇండ్లను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సూచించారు.నిర్మాణాల మంజూరు ప్రక్రియలో అధికారులు అలసత్వం వహించకూడదని స్పష్టం చేశారు. నిజమైన అర్హులకే ఇండ్లు మంజూరు అయ్యేలా చూడాలని ఆదేశించారు.రెండవ దశ నిర్మాణాల మంజూరుపై ఆరా తీసిన కలెక్టర్, నిర్మాణానికి ఆసక్తి ఉన్న అర్హులైన లబ్ధిదారులకు



మంజూరు చేయాలని అన్నారు.మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం చేయాలి వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా లక్ష్యం మేరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు.మొక్కలు నాటేందుకు సరిపడా సిద్ధంగా ఉంచాలని,గుంతలు తీసి పెట్టాలని సూచించారు.టెలీ కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు,డీఆర్డీఓ లక్ష్మీనారాయణ,డీపీఓ జయశీల తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియత్రణయే లక్ష్యంగా ప్రమాదాలు జరుగు(బ్లాక్ స్పాట్స్) ప్రదేశాలు సందర్శన

**-రోడ్డు ప్రమాదాల నివారణలో వాహనదారులు, ప్రజలు భాగస్వామ్యం కావాలి**

**-జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

జులై 16 వార్త సాక్ష్యం

రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే గురువారం రోజున బోయినపల్లి మండలం కోదురుపాక చౌరస్తాలో ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ ప్రాంతాన్ని వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, బోయినపల్లి ఎస్ఐ లతో కలిసిపరి శీలించారు. ఈ సందర్భంగా ప్రమాదాలకు దారితీసే కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల విలువైన ప్రాణాలను కాపాడేందుకు ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం,అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు నిర్మించడం,స్ట్రీట్ లైటింగ్ కల్పించడం, రోడ్డు భద్రతా ప్రమాణాలకు అనుగు ణంగా అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే వాహ నదారులు ట్రాఫిక్,రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటిస్తూ అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించి సురక్షిత ప్రయాణాన్ని అలవాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అనంతరం మిడ్ మానేర్ డ్యామ్‌ను సందర్శించి,సంబంధిత ఇంజనీర్లతో డ్యామ్ భద్రత మరియు తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు.డ్యామ్ పరిసర ప్రాంతాల్లో ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా



అన్ని శాఖలు సమన్వయంతో అప్రమత్తంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.ఎస్పీ వెంట వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్,ఎస్.ఐ రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.

# భూముల సర్వే, రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

జులై 16 వార్త సాక్ష్యం

భూముల సర్వే,రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికా రులను ఆదేశించారు. గురువారం సాయంత్రం భైంసా మండలం బాబుల్ గావ్ గ్రామంలో జరుగు తున్న భూముల రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడు తూ. మ్యాపులు లేని గ్రామాలకు మ్యాపులు తయారు చేసేందుకు చేపట్టిన సర్వేను పారదర్శకంగా చేపట్టాల న్నారు. రీ సర్వేకు సంబంధించిన వివరాలను అధికా రులను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో అత్యాధునిక సాంకేతికత వినియోగించి రీ సర్వే ప్రక్రియ



చేపట్టిందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను మొత్తాన్ని గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక రైతులతో మాట్లాడుతూ. రైతులందరూ ఆయిల్ ఫామ్ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. తక్కువ పెట్టుబడి,తక్కువ శ్రమతో ఎక్కువ లాభాలు వస్తాయని అన్నారు. వాతావరణ పరిస్థితులు, నీటిల భ్యత, వర్షాలను బట్టి పంటలు



సాగు చేయాలన్నారు. పంట మార్పిడి విధానాలపై దృష్టి పెట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,ఏడి ల్యాండ్ సర్వే ల్యాండ్ రికార్డ్ నరసింహ మూర్తి, తహసిల్దార్ శశి భూషణ్,గ్రామ సర్పంచ్ అనసూయ మహేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సభల ద్వారా రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి. ఎస్ లత**




జులై 16 వార్త సాక్ష్యం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూసర్వే-రీ సర్వే సందర్భంగా గురువారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి. ఎస్ లత ఆధ్వర్యంలో ధర్మపురి, గొల్లపెల్లి మండలంలోని నాగారం, అబ్బాపూర్ గ్రామాల్లో భూముల రీ-సర్వేకు సంభందించిన అవగాహణ సదస్సు ( గ్రామ సభ) నిర్వహించారు.ఈ సందర్భంగా భూమి రీ- సర్వే చేయుటలో చట్టం పరిదిలో వున్నా సర్వే సరిహద్దుల చట్టం , 1923 గురించి మరియు సర్వే కార్యాక్రమాల గురించి, సర్వే చేయు పని విదానాల గురించి ఇట్టి గ్రామ సభలో గ్రామ రైతులకు మరియు గ్రామ ప్రజలకు అవగాహణ కల్పించారు.ఈ కార్యక్రమంలో ధర్మపురి, గొల్లపెల్లి తహసీల్దార్ లు శ్రీనివాస్, మాజీద్, సంబంధిత సిబ్బంది, మరియు తదితరులు పాల్గొన్నారు.

## దేవక్కపేట్ అటవీ ప్రాంతంలో 9 నాటు తుపాకులు స్వాధీనం

**-9 మంది నిందితుల అరెస్టు**

జులై 16 వార్త సాక్ష్యం

నిజామాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య ఆదేశాల మేరకు, సి సీస్ ఎస్ మరియు భీమ్‌గల్ పోలీస్ లు సంయుక్తంగా జరిపిన ఆపరేషన్ లో భీంగల్ పరిధిలోని దేవక్కపేట్ గ్రామ శివారులో గురువారం తెల్లవారుజామున నమ్మదగిన సమాచారం మేరకు అటవీ ప్రాంతం లో అనుమనస్పదంగా సంచరిస్తున్న కొందరు వ్యక్తులని పట్టుకొని వారిని తనిఖీ చేయగా వారి వద్ద మొత్తం 9 నాటు తుపాకులు లభించాయనీ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తిపారు. ఇట్టి ఆయుధాలకు ఎలాంటి చట్టబద్ధమైన లైసెన్సులు లేకపోవడం వలన వాటిని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి నిందితులని మరియు అట్టి ఆయుధాలని రిపేర్ చేసిన మరొక నిందితుడు రాజు ని కూడా అరెస్ట్ చేసి రేమండ్ నిమిత్తం కోర్టు లో హాజరు పరచారు. ప్రాథమిక విచారణలో నిందితులు అడవి జంతువులు మరియు ఇతర వన్యప్రాణులను వేటాడేందుకు వాటిని ఉపయోగించేవారని, ఇటీవల దేవక్కపేట్ అటవీ ప్రాంతంలో చిరుతపులి మృతి చెందిన ఘటన అనంతరం పోలీసులు మరియు అటవీ శాఖ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వారి వద్ద ఉన్న లైసెన్స్ లేని నాటు తుపాకులను అడవిలో దాచిపెట్టేందుకు తీసుకెళ్తుండగా పోలీసులకు చిక్కినట్లు విచారణలో వెల్లడించారు. భూక్యా రఘుపతి, కార్ల అంజయ్య, ముదావత్ తిరుపతి, భూక్యా చందర్, ముర్రి గంగ నర్సయ్య, అనిమేని లింబాద్రి, మాలావత్ కుంభ, బానావత్ గంగారెడ్డి, మాలావత్ ధారి సింగ్, అకునూర్ రాజు లను అదుపులోకి తీసుకున్నారు.ఈ ఆపరేషన్ ను సి.పి సాయి చైతన్య ఆద్వర్యం లో సి.సి.యస్ ఏ.సి.పి పి. శ్రీశైలం , ఆర్మూర్ ఏ.సి.పి జె.వేంకటేశ్వర రెడ్డి , సి ఐ లు సురేష్ , పి సత్యనారాయణ గౌడ్ , సాయినాథ్, యస్. ఐ సి హెచ్ తిరుపతి మరియు సి.సి.యస్, భీంగల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది త్వరితగతిన చేపట్టినందుకు సి.పి అభినందించినారు.

## పదోన్నతి మరింత బాధ్యతను పెంచుతుంది

**-సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి.**

**- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా.**



జులై 16 వార్త సాక్ష్యం

శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేసే పోలీసు శాఖలో పదోన్నతి పొందిన ప్రతి పోలీసు అధికారిపై బాధ్యత మరింత పెరుగుతుందని, అప్పగించిన విధులను సమర్థవంతంగా, నిజాయితీతో, నిబద్ధతతో నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు.ఏఎస్ఐలుగా విధులు నిర్వహిస్తూ ఎస్ఐలుగా పదోన్నతి పొందిన ఎ.సత్తయ్య, పి.వెంకన్న గౌడ్, ఎం.ఎ.హబీబ్ గురువారం పోలీస్ కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వారి భుజాల పై పదోన్నతి చిహ్నాలను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పదోన్నతి పొందడం ప్రతి ఉద్యోగికి గర్వకారణమని, అయితే దానితో పాటు బాధ్యత కూడా మరింత పెరుగుతుందని అన్నారు. విధుల్లో ఎల్లప్పుడూ నిజాయితీ,క్రమశిక్షణ, అంకితభావం తో పనిచేస్తూ ఉన్నతాధికారుల విశ్వాసాన్ని నిలబెట్టు కోవాలని సూచించారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## వ్యక్తిగత భద్రతను తగ్గించుకున్న వరంగల్ సీపీ శ్వేత

జులై 16 వార్త సాక్ష్యం




రాష్ట్రంలో మావోయిస్టుల ప్రాబల్యం గణనీయంగా తగ్గిన నేపథ్యంలో, పోలీస్ అధికారులకు కేటాయిస్తున్న గన్మెన్ల విధానాన్ని పునః సమీక్షించాలంటూ వరంగల్‌కు చెందిన మహ్మద్ ఫసియుజ్జామా రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు. ప్రస్తుతం ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులకు విరివిగా అమలు చేస్తున్న 'వన్ ప్లస్ వన్' (1o1) గన్మెన్లు/పీఎస్‌ఓల కేటాయింపుపై పునరాలోచన చేయాలని ఆయన కోరారు.?శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని,ఇలాంటి తరుణంలో అవసరమైన వారికి మాత్రమే భద్రత కల్పించాలని లేఖలో సూచించారు.ముప్పు లేని అధికారుల వద్ద ఉన్న అదనపు సిబ్బందిని వెనక్కి పిలిపించి,పోలీస్ స్టేషన్లలో కేటాయించడం ద్వారా సిబ్బంది కొరతను అధిగమించవచ్చని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు.

**-ఆదర్శంగా నిలిచిన సీపీ శ్వేత:**

ఇదిలావుండగా,నక్సల్స్ నుంచి తనకు ఎలాంటి ముప్పు లేదని స్పష్టం చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) శ్వేత తన వ్యక్తిగత భద్రతను తగ్గించుకున్నారు.గతంలో ఆమెకు నలుగురు గన్మెన్లు ఉండగా,ఆ సంఖ్యను ఇద్దరికి కుదించుకుంటూ స్వచ్ఛందంగా నిర్ణయం తీసుకున్నారు.సిబ్బందిని వృథా చేయకుండా క్షేత్రస్థాయి విధులకు వాడుకోవాలనే ఉద్దేశంతో సీపీ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు పోలీస్ శాఖతో పాటు ప్రజల్లోనూ విశేష ఆదరణ పొందుతోంది.

## వర్షాలు లేక బీడువారిన భూములు..రైతుల ఆవేదన

**-ఎల్‌నినో ప్రభావంతో ఎండిపోతున్న పంటలు**
**-తాగునీటికీ తీవ్ర కష్టాలు**
**-రెండోసారి విత్తనాలు వేస్తున్న రైతులు**
**-వర్షాల కోసం ఆకాశం వైపు ఎదురుచూపులు**

జులై 16 వార్త సాక్ష్యం



తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు రోజురోజుకూ తీవ్రతరమ వుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వ్యవసాయం సంక్షోభంలో పడింది.ముఖ్యంగా వర్షాధార వ్యవసాయంపై ఆధారపడిన రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.జూన్ నెలలో ఆశతో విత్తనాలు చల్లిన పత్తి,కంది, సోయాబీన్,జొన్న,మొక్కజొన్న తదితర పంటలు నీటి కొరతతో ఎండిపోతుండటంతో రైతులు పెట్టుబడులు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలోని చెరువులు, కుంటలు,చిన్న నీటి వనరులు పూర్తిగా ఎండిపోవడంతో పాటు ప్రాజెక్టుల్లోనూ నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి.బోరు బావుల్లో భూగర్భ జలమట్టం పడిపోవడంతో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇప్పటికే సాగు చేసిన పంటలను కాపాడుకోవడానికి రైతులు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నా ఫలితం కనిపించడం లేదని వాపోతున్నారు.

**-రెండోసారి విత్తనాలు వేస్తున్న రైతులు**

మొదటిసారి వేసిన పంటలు మొలక దశలోనే ఎండిపోవడంతో పలుచోట్ల రైతులు మళ్లీ విత్తనాలు కొనుగోలు చేసి రెండోసారి విత్తనాలు వేస్తున్నారు. అయితే మరోసారి కూడా వర్షాలు కురవకపోతే భారీ నష్టం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.విత్తనాలు, ఎరువులు,కూలీల ఖర్చులు పెరగడంతో అప్పుల భారం మరింత అధికమవుతోందని చెబుతున్నారు.

**-ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో దయనీయ పరిస్థితి**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, నిర్మల్,దండేపల్లి మండలాల్లో పరిస్థితి మరింత విషమంగా మారింది.రైతులు బావుల పూడికను తొలగించి మిగిలిన కొద్దిపాటి నీటిని బయటకు తీసి పంటలకు అందిస్తున్నారు.కొందరు డ్రమ్ములు,బిందెలతో నీటిని మోసుకెళ్లి మొక్కలను తడుపుతున్నారు.ఈ దృశ్యాలు వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభానికి అద్దం పడుతున్నాయి.

**-తాగునీటికీ తీవ్ర ఇబ్బందులు**

వ్యవసాయమే కాదు, గ్రామాల్లో తాగునీటి సమస్య కూడా తీవ్రమైంది.బోర్లు ఎండిపోవడంతో గ్రామీణులు తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. మహిళలు,వృద్ధులు నీటి కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.పశువులకు కూడా తాగునీరు,మేత అందక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.పంటలు ఎండిపోతున్న ప్రాంతాలను వెంటనే గుర్తించి వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, అవసరమైన చోట అత్యవసర సాగునీటి ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అలాగే నష్టపోయిన రైతులకు పరిహారం,విత్తనాలు, ఎరువులపై సబ్సిడీ అందించాలని కోరుతున్నారు. వాతావరణ పరిస్థితులు త్వరలో అనుకూలించి మంచి వర్షాలు కురవకపోతే ఖరీఫ్ సీజన్ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రైతుల చూపంతా ఆకాశం వైపే నిలిచిపోయింది.మంచి వర్షం పడితేనే పంటలు బతుకుతాయని, లేకపోతే ఈ సీజన్ మొత్తం నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మంచిర్యాలలో ప్రజాసంఘాల నిరసన ప్రదర్శన

**-సోనం వాంగ్చుక్ ప్రాణాలు కాపాడాలి!**
**-నీట్ వైఫల్యంపై కేంద్ర విద్యా మంత్రి రాజీనామా చేయాలి!!**

జులై 16 వార్త సాక్ష్యం

దేశ రాజధాని లో 19 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న సోనం వాంగ్చుకుతో చర్చలు జరిపి కేంద్ర ప్రభుత్వం దీక్షను విరమింపజేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం రోజున అంబేద్కర్ విగ్రహం దగ్గర జరిగిన నిరసన ప్రదర్శనలో వివిధ ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వైఫల్యం కారణంగానే నీట్ పేపరు లీకయి 21 మంది అమాయక విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని వారు ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి కాబట్టి, బాధ్యతలను సక్రమంగా నిర్వహించని కేంద్ర మంత్రిని పదవి నుండి బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. 19 రోజులుగా సోనం వాంగ్చుక్ నిరాహారదీక్ష చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వ పెద్దలు నిర్లక్ష్య ధోరణి వహించడం సరైనది కాదని వారు తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ఉద్యమకారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని వారు కోరారు.గతంలో లోక్ పాల్ బిల్లు కోసం అన్నా హజారే నిరసన దీక్ష చేపట్టినప్పుడు.. మన్మోహన్ సింగ్ ప్రభుత్వం దిగివచ్చి ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చిందని వారు గుర్తు చేశారు.నేటి కేంద్ర ప్రభుత్వ పెద్దలు మొండి వైఖరిని అవలంబించడాన్ని దేశ ప్రజలు నిరసిస్తున్నారని వారు తెలిపారు. దేశానికి విలువైన సేవలు అందించిన శాస్త్రవేత్తగా పర్యావరణవేత్తగా సోనం వాంగ్చుకు దేశ ప్రజలందరికీ ఆప్త బంధువుగా నిలిచాడని వారు పేర్కొన్నారు. సోనం వాంగ్చుకు ప్రాణాలు వెలకట్టలేనివని, తక్షణం ప్రభుత్వ పెద్దలు చర్చలకు సిద్ధం కావాలని వారు కోరారు.ప్రభుత్వ విధానాలపై నిరసన తెలుపుతున్న వారిని దేశద్రోహులని, విదేశీ ఏజెంట్లని నిందించడం మానుకోవాలని హితవు పలికారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురావడంతో పాటు. యువతకు ఉపాధి కల్పించే దిశలో పాలకులు శ్రద్ధ తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పౌర స్పందన వేదిక కన్వీనర్ క్యాతం



రవికుమార్, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం,బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య, బీసీ మేధావుల ఫోరం జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ శ్రీరామోజు కొండయ్య, తెలంగాణ జన సమితి నాయకులు ప్రదీప్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర నాయకులు జైపాల్ సింగ్,సామాజిక ఉద్యమ కారులు డాక్టర్ చుంచు రాజ్ కిరణ్, మోతె రామ దాసు, శ్రీమన్నారాయణ,బొజ్జ శరత్,సంకె రవి, గోగుల రవీందర్ రెడ్డి, రాధేశ్యాం,వేముల కిరణ్, షబ్బీర్ పాషా, కైలాసం,పడాల శ్రీనివాస్, మధు, జాగిరి రాజేష్,పూరెల్ల నితీష్, అంకం సాగర్,మెరుగు సతీష్, సమ్మయ్య,మహ్మద్ ఇబ్రహీం,కట్ట ప్రకాష్, మిడివెల్లి రాజ్ కుమార్,అడ్వాల లింగమూర్తి, రాజగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాషను మన సంస్కృతిగా భావించి విద్యార్థులకు బోధించాలి

**-జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)పి.చంద్రయ్య**

జులై 16 వార్త సాక్ష్యం

తెలుగు భాషను మన సంస్కృతిగా భావించి విద్యార్థులకు బోధించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు భాషా శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ. తెలుగు భాషను కేవలం ఒక పాఠ్యాంశంగా కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా భావించి విద్యార్థులకు బోధించాలని తెలుగు భాష ఉపాధ్యాయులకు సూచించారు.శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న వినూత్న బోధనా పద్ధతులను పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులలో తెలుగు భాషపై ఆసక్తి, అభిరుచిని



పెంపొందించాలని తెలిపారు.ప్రస్తుత పరిస్థితులలో ఇతర భాషల ప్రభావం కారణంగా విద్యార్థులకు తెలుగు భాషను సమర్థవంతంగా బోధించడం కొంత సవాలుగా మారిందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు తెలుగు ఉపాధ్యాయులు సృజనాత్మక బోధనా విధానాలను అవలంబించాలని తెలిపారు. ముఖ్యంగా కథలు,కవితలు, పద్యాలు, నాటికలు వంటి సాహిత్య ప్రక్రియలను ఉపయోగించి



విద్యార్థులలో భాషా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు,శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోర్సు కో-ఆర్డినేటర్ జంబోజు సత్తయ్య, శిక్షణ కేంద్ర ఇన్‌చార్జి బోనగిరి శ్రీనివాస్,జిల్లా స్థాయి డి.ఆర్.పి.లు, తెలుగు భాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కేజీబీవీ పాఠశాలను సందర్శించిన కలెక్టర్

**-తహసిల్దార్ కార్యాలయం తనిఖీ**

జులై 16 వార్త సాక్ష్యం

నందిపేట మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. పాఠశాల ఆవరణను, డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్, తరగతి గదులను పరిశీలించారు. బియ్యం బస్తాలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడ కూడా నీరు నిలువ ఉండకూడదని నిర్వాహకులకు సూచించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. చిన్నచిన్న లోపాలను గమనించిన కలెక్టర్, వాటిని సరి చేసుకోవాలని సూచించారు. బాలికలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని అన్నారు. అనంతరం 7వ తరగతి గదికి వెళ్లి విద్యార్థినులతో భేటీ అయ్యారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పలు ప్రశ్నలు వేసి, విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. వ్యక్తిగత భద్రత, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, తల్లిదండ్రులు, సంరక్షకులు తప్ప ఇతరులు ఎవరు వచ్చినా వారితో వెళ్లకూడదని జాగ్రత్తలు సూచించారు.అనంతరం నందిపేట మండల తహసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించిన సందర్భంగా లోపాలను గుర్తించి, తహసిల్దార్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, అక్రమాలకు తావు కల్పించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్ భూములు కబ్జాకు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదేనని స్పష్టం చేశారు. ఈ



విషయంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఎంతమాత్రం ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. రికార్డులను పక్కాగా నిర్వహిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ ఉన్నారు.

# దిల్‌సుఖ్‌నగర్‌లో మరోసారి రోడ్డెక్కిన నిరుద్యోగులు

**-20 వేల పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్**
**-నిరసనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

జులై 16 వార్త సాక్ష్యం

రాష్ట్రంలో 20 వేల పోలీస్ ఉద్యోగాలతో కూడిన భారీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ యువత గురువారం హైదరాబాదులోని దిల్‌సుఖ్‌నగర్‌లో ఆందోళనకు దిగింది.పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు రోడ్డెక్కి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ డిమాండ్లను వినిపించారు. నిరసనకారులు మాట్లాడుతూ, రాష్ట్రంలో వేల సంఖ్యలో పోలీస్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ విడుదల చేయడంలో జాప్యం చేస్తోందని ఆరోపించారు. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే 20 వేల పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసి నియామక ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఆందోళన



తీవ్రరూపం దాల్చకుండా ముందస్తు చర్యగా పోలీసులు భారీగా మోహరించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నిరుద్యోగులను అదుపులోకి తీసుకుని పోలీస్ వాహనాల్లో సమీప పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా నిరుద్యోగులు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకుని శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ తమను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య



హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకునే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనతో అక్కడ స్వల్పంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.ప్రస్తుతం పరిస్థితి ప్రశాంతంగా ఉందని పోలీసులు తెలిపారు.

వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR



# మంచిప్ప--కొండెం చెరువు ప్రాజెక్టును పాత డిజైన్‌తోనే పూర్తి చేస్తాం

జులై 16 వార్త సాక్ష్యం

రైతులకు తక్కువ వ్యయంతో శాశ్వత సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి స్పష్టం చేశారు. మోపాల్ మండలం మంచిప్ప గ్రామంలోని కొండెం--మంచిప్ప చెరువు ప్రాంతాన్ని సందర్శించిన వారు రైతుల సమస్యలు, వినతులను స్వీకరించి ప్రాజెక్టు పురోగతిపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2009--2014 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన అసలు డిజైన్‌తో ఈ ప్రాజెక్టు పనులు వేగంగా సాగాయని, సుమారు రూ.1,300 కోట్ల అంచనాతో ప్రతిపాదించిన ప్రాజెక్టులో దాదాపు రూ.900 కోట్ల వ్యయంతో 85 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. అయితే అనంతరం అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం అసలు డిజైన్‌ను రద్దు చేసి రీడిజైన్ పేరుతో ప్రాజెక్టు స్వరూపాన్ని మార్చిందని విమర్శించారు. రీడిజైన్ కారణంగా ప్రాజెక్టు వ్యయం రూ.3,000 కోట్ల వరకు పెరిగిందని, దాదాపు రూ.1,800 కోట్ల ప్రజాధనం ఖర్చు చేసినప్పటికీ రైతులకు ఉపయోగపడే విధంగా పనులు పూర్తి కాలేదని ఆరోపించారు. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే పనులను భారీ వ్యయంతో మార్చడం వెనుక కమీషన్ల రాజకీయమే ప్రధాన కారణమని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని, అందుకే గతంలో కాంగ్రెస్ రూపొందించిన పాత డిజైన్‌ను పునరుద్ధరించి అదే ప్రణాళిక ఆధారంగా ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ ఇంజనీర్లకు సాంకేతిక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.రైతుల విజ్ఞప్తి మేరకు మంచిప్ప--కొండెం చెరువు ప్రాజెక్టు ద్వారా సిరికొండ, ధర్పల్లి మండలాలకు ఓపెన్ కెనాల్ ద్వారా సాగునీరు అందించే అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. గుంట భూములు కోల్పోకుండా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టేలా ప్రణాళికలు రూపొంది స్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి, డిచ్‌పల్లి మండలాల్లోని సుమారు 85 వేల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని పేర్కొన్నారు. దాదాపు 50 కిలోమీటర్ల మేర ఓపెన్ కెనాల్స్ నిర్మించడం ద్వారా నీటి నిల్వలు పెరిగి వ్యవసాయానికి శాశ్వత ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. త్వరలో సాంకేతిక ప్రణాళికలను ఖరారు చేసి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజాధనాన్ని వృథా చేసే విధానాలకు బదులుగా రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి నమూనానే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు



చేస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు చేసిన వారు, కాళేశ్వరం ప్రాజెక్టులో అనుసరించిన విధానాన్నే ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టులో కూడా అమలు చేయడానికి ప్రయత్నించారని, దాని ఫలితంగా వ్యయభారం పెరిగి ప్రాజెక్టుల లక్ష్యం దెబ్బతిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పారదర్శకత, శాస్త్రీయ ప్రణాళిక, రైతు సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకొని ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి , రాష్ట్ర గీతా పారిశ్రామిక సహకార కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,, మాజీ ఐసిడిఎంఎస్ చైర్మన్ సాయరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారత్‌ను భయపెడుతున్న ఎల్ నినో 2026

**-చరిత్రలో ఎన్నడూ లేని కరువు రానుందా?**

జులై 16 వార్త సాక్ష్యం

వేసవితగ్గి వర్షాకాలం వచ్చినా ఎండలు మాత్రం తగ్గడం లేదు. దీనికి ప్రధాన కారణంగా వేగంగా తీవ్రరూపం దాల్చుతున్న 'ఎల్ నినో' అని తెలుస్తోంది. రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతున్న ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ శాస్త్రవేత్తలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇది మునుపెన్నడూ లేని విధంగా చరిత్రలోనే అత్యంత బలమైన వాతా వరణ మార్పులలో ఒకటిగా నిలువనున్నట్టు అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫి యరిక్ అడ్మినిస్ట్రేషన్ ధృవీకరించింది. ఈ ఏడాది చివరి నాటికి ఇది మరింత బలపడి, ఉత్తరార్ధగోళ శీతాకాలంలో గరిష్ట స్థాయికి చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు.

**-గత రికార్డులను బద్దలు కొట్టే దిశగా**

వాతావరణ శాస్త్రవేత్త జీక్ హౌస్‌ఫాదర్ 14 రకాల వాతావరణ నమూనాల నుండి సేకరించిన 667 అంచనాల విశ్లేషణ ప్రకారం.. ప్రస్తుత పొంచి ఉన్న ఈ ఎల్ నినో గతంలో కంటే ఎక్కువ వినాశాన్ని సృష్టించిన వచ్చని అంచనా వేస్తున్నారు. అంటే 1982-83, 1997-98,2015-16 నాటి రికార్డులను కూడా ఇది అధిగమించే అవకాశం ఉందని తెలిపారు. 2015-16లో గరిష్ఠంగా 2.75సెల్సియస్ ఉష్ణోగ్రత వ్యత్యాసం నమోదు కాగా, ఈసారి ఇది ఏకంగా 3.6సెల్సియస్ వరకు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

**-ఈ అంచనాలు నిజమేనా..ప్రస్తుత పరిస్థితి ఏంటి?**

ఎన్ఓఏఏ డేటా ప్రకారం,జూలై 13 నాటికే పసిఫిక్ మహాసముద్రంలోని నినో 3.4 అండ్ ఫైమ్ ప్రాంతంలో ఉష్ణోగ్రత వ్యత్యాసం 2.2సెల్సియస్ కి చేరిందని,1982 నుండి ఉపగ్రహ రికార్డులను పరిశీలిస్తే,ఒక క్యాలెండర్ ఏడాదిలో ఇంత ముందుగానే ఈ స్థాయి వేడి నమోదు కావడం ఇదే మొదటిసారని నివేదికలు చెబుతున్నాయి. ఈ స్థాయిలో వేడెక్కడం అనే రాబోయే రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన వడగాలులు,వరదలు,కరువు పరిస్థితులు ఏర్పడడానికి సూచనలు కావొచ్చని నివేదికలు అంచనా వేస్తున్నాయి.

**-భారతదేశంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది?**

భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనాల




ప్రకారం,ఈ ఏడాది నైరుతి రుతుపవనాల వర్షపాతం దీర్ఘకాల సగటులో కేవలం 90 శాతం మాత్రమే ఉండే అవకాశం ఉంది. సాధారణంగా ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించే 'హిందూ మహాసముద్ర ద్విధ్రువం' ఈసారి తటస్థంగా ఉంది. అంటే,ఎల్ నినో సృష్టిస్తున్న నష్టాన్ని అడ్డుకునే ఎలాంటి సహజ పరిహార యంత్రాంగం ప్రస్తుతం మనకు అనుకూలంగా లేదని తెలిపింది. ఈ కారణంగా గత జూన్ నెలలో వర్షపాతం సాధారణం కంటే 40 శాతం తక్కువగా నమోదైందని,గత 126 ఏళ్లలో ఇది దేశంలోనే 5వ అత్యంత తక్కువ వర్షపాతం జూన్‌లోనే నమోదైనట్టు తెలుస్తోంది.

# కొత్తగూడెం మాతా శిశు ఆసుపత్రిలో అమానవీయ ఘటన

**-వైద్యుల నిర్లక్ష్యంతో నిల్చున్న చోటే ప్రసవం**
**-ఎత్తులో నుండి పడడంతో శిశువుకు గాయాలు**

జులై 16 వార్త సాక్ష్యం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాతా శిశు కేంద్రంలో జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ప్రసవ వేదనతో ఆసుపత్రికి వచ్చిన గర్భిణీని వైద్య సిబ్బంది సకాలంలో పట్టించుకోకపోవడంతో ఆమె ఆసుపత్రి ప్రాంగణంలోనే నిల్చున్న చోటే ప్రసవించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటనలో నవజాత శిశువు నేలపై పడిపోయి గాయపడినట్లు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, ప్రసవ నొప్పులతో బాధపడుతున్న గర్భిణీని వెంటనే లేబర్ వార్డుకు తరలించి చికిత్స అందించాల్సిన వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారనిఆరోపించారు. పలుమార్లు సిబ్బందిని కోరినా స్పందించకపోవడంతో కొద్దిసే పటికే గర్భిణీ అక్కడికక్కడే ప్రసవించిందని తెలిపారు. ప్రసవ సమయంలో నవజాత శిశువు కిందపడి పోవడంతో గాయాలయ్యాయని,అనంతరం కూడా కొంతసేపటి వరకు వైద్యులు అక్కడికి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన ఇతర రోగులు,వారి బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి ఘటన జరగడం దారుణమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని ఘటనపై వివరాలు సేకరించారు. బాధిత కుటుంబ సభ్యుల వాంగ్మూలాన్ని నమోదు చేసి విచారణ ప్రారంభించారు. శిశువు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఈ ఘటనపై ఆసుపత్రి యాజ మాన్యం స్పందిస్తూ పూర్తి వివరాలను పరిశీలిసు _న్నామని, ఘటనకు దారితీసిన పరిస్థితులపై అంతర్గత విచారణ చేపడతామని తెలిపినట్లు సమాచారం. అయితే,



కుటుంబ సభ్యులు మాత్రం వైద్యుల నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని ఆరోపిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఘటన మరోసారి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి సేవల నిర్వహణ,వైద్య సిబ్బంది బాధ్యతలపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న వైద్య సేవల్లో నిర్లక్ష్యం పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ల్యాండ్ చీటింగ్ కేసులో నిందితుడు అరెస్ట్- రిమాండ్‌కు తరలింపు

**-ఇతరుల భూమిని తనదిగా చూపించి లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణ**
**-భూముల కొనుగోలు సమయంలో పత్రాలు తప్పనిసరిగా ధృవీకరించుకోవాలి**
**-సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్**

జులై 16 వార్త సాక్ష్యం

భూముల పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న ఓ నిందితుడిని చివ్వెంల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. లేని భూమిని ఉన్నట్లుగా, ఇతరులకు చెందిన భూమిని తనదిగా చూపిస్తూ ప్లాట్ల పేరుతో భారీ మొత్తంలో నగదు వసూలు చేసి మోసానికి పాల్పడుతున్న వ్యవస్థీకృత నేరస్థుడిని అరెస్టు చేసినట్లు సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.రాజశేఖర్ తెలిపారు. సూర్యాపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ రాజశేఖర్ వివరాలు వెల్లడించారు. అయిలాపురం గ్రామ శివారులో ఉన్న భూమిని ప్లాట్లుగా విక్రయిస్తానని నమ్మబలికి,వాస్తవానికి ఇతరులకు చెందిన భూమిని తనదిగా చూపించిన కాసర్ల సురేందర్ రెడ్డి,కోడదల వెంకన్న,కోడదల కనకయ్యల నుంచి భారీ మొత్తంలో నగదు తీసుకున్నాడు. అనంతరం భూమిని రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో బాధితుడు కోడదల వెంకన్న చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన చివ్వెంల ఎస్ఐ మహేశ్వర్ విచారణలో సంబంధిత భూమి కాసర్ల సురేందర్ రెడ్డికి చెందినది కాదని,ఇతరుల భూమిని తనదిగా చూపించి బాధితులతో పాటు మరికొందరిని కూడా మోసం చేసినట్లు



గుర్తించారు. దర్యాప్తులో సేకరించిన ఆధారాల మేరకు నిందితుడు కాసర్ల సురేందర్ రెడ్డిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఇంకా బాధితులు ఉంటే ముందుకు రావాలి .ఈ తరహా మోసాలకు గురైన మరిన్ని బాధితులు ఎవరైనా ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ కోరారు. భూముల కొనుగోలు, విక్రయాల సమయంలో సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని, యాజమాన్య హక్కులను రెవెన్యూ అధికారుల ద్వారా ధృవీకరించుకున్న తర్వాతే లావాదేవీలు నిర్వహించాలని పోలీసులు ప్రజలకు సూచించారు. సంఘటితంగా భూముల మోసాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట రూరల్ సీఐ జి.రాజశేఖర్ స్పష్టం చేశారు.

# సైబర్ నేరాలే భవిష్యత్‌లో అతిపెద్ద సవాలు:డీజీపీ సి.వి.ఆనంద్

**-సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించి దేశంలోనే అగ్రస్థానంలో నిలవాలి**
**-ఏఐ ఆధారిత కాల్ సెంటర్,సైబర్ ల్యాబ్‌ల పనితీరుపై సమగ్ర సమీక్ష**

జులై 16 వార్త సాక్ష్యం

సైబర్ నేరాలు రోజురోజుకూ కొత్త రూపాలు దాల్చుతున్న నేపథ్యంలో వాటిని సమర్థవంతంగా అరికట్టేందుకు ఆధునిక సాంకేతికతను పూర్తిస్థాయిలో



వినియోగించాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి.ఆనంద్ అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లో దేశానికి అతిపెద్ద సవాలు సైబర్ నేరాలేనని, ఇప్పటి నుంచే సాంకేతిక పరిజ్ఞానం,కృత్రిమ మేధస్సు (ఏఐ),డేటా అనలిటిక్స్ ఆధారంగా పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో నిర్వహించిన సమగ్ర సమీక్ష సమావేశంలో పాల్గొన్న డీజీపీ,సైబర్ ల్యాబ్, సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ (ఎస్ఓసీ),సెంట్రల్ మానిటరింగ్ యూనిట్, సోషల్ మీడియా యూనిట్, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, డిజిటల్ ఫోరెన్సిక్ విభాగాల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. సాంకేతిక సామర్థ్యాలు,దర్యాప్తు విధానాలు,ఆధునిక సాంకేతికత వినియోగంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

**-ఏఐ కాల్ సెంటర్‌కు డీజీపీ ప్రశంసలు**

సమీక్ష సందర్భంగా డీజీపీ స్వయంగా ఏఐ ఆధారిత సైబర్ కాల్ సెంటర్ పనితీరును పరిశీలించారు. సైబర్ మోసానికి గురైన బాధితుడు ఫోన్ చేసిన వెంటనే ఏఐ వ్యవస్థ స్పందించి,బాధితుడికి ధైర్యం చెబుతూ పేరు,ప్రాంతం, సంఘటన వివరాలను నమోదు చేసి సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ఆటోమేటిక్‌గా సమాచారం పంపించే విధానాన్ని పరిశీలించారు. ప్రజలకు మరింత వేగంగా సేవలు అందించేందుకు ఈ సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని అధికారులకు సూచించారు.

**-సైబర్ నేరాల్లో తగ్గుతున్న ఆర్థిక నష్టం**

అధికారులు వెల్లడించిన గణాంకాల ప్రకారం,2025లో రాష్ట్రంలో సైబర్ నేరాల వల్ల రూ.1,524 కోట్ల ఆర్థిక నష్టం నమోదైనా,గత ఏడాదితో పోలిస్తే 20 శాతం తగ్గుదల కనిపించింది. సైబర్ ఫిర్యాదులు 91,369కు పరిమితమవడంతో ఫిర్యాదుల్లో కూడా 3 శాతం తగ్గుదల నమోదైంది. నేరస్తుల ఖాతాల్లోని నిధులను నిలిపివేసే (పిహెచ్‌ఓ) మొత్తం రూ.255 కోట్ల నుంచి రూ.279 కోట్లకు పెరగగా,బాధితుల సొమ్ము రక్షణలో రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించినట్లు అధికారులు వివరించారు.

**-రికవరీ,ఎఫ్ఐఆర్ నమోదులో తెలంగాణ ముందంజ**

దేశవ్యాప్తంగా 2025లో నమోదైన 49,620 సైబర్ ఎఫ్ఐఆర్ లలో తెలంగాణలోనే 21,639 కేసులు నమోదయ్యాయి. అంటే దేశంలోని మొత్తం సైబర్ ఫీ×=లలో 44 శాతం తెలంగాణ నుంచే నమోదవడం రాష్ట్ర పోలీసుల చురుకైన చర్యలకు నిదర్శనమని అధికారులు తెలిపారు. రూ.75 లక్షలకు పైగా నష్టం కలిగిన కేసుల్లో 78 శాతం,రూ.1 లక్షకు పైగా నష్టం కలిగిన కేసుల్లో 56 శాతం ఎఫ్ఐఆర్ కన్వర్షన్ రేటు నమోదు కావడం కూడా రాష్ట్ర పోలీసుల సమర్థవంతమైన పనితీరును ప్రతిబింబిస్తోందని వెల్లడించారు.

**-ఇతర నేరాల కంటే ఏడు రెట్లు అధిక ఆర్థిక నష్టం**

2025లో నమోదైన మొత్తం 86,177 ప్రధాన నేరాల ఫీ×=లలో 21,639 కేసులు సైబర్ నేరాలకు సంబంధించినవే. ఇతర ప్రధాన నేరాల వల్ల రూ.207 కోట్ల ఆర్థిక నష్టం సంభవించగా, సైబర్ నేరాల వల్ల ఒక్క ఏడాదిలోనే రూ.1,524 కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు వివరించారు. ఇతర నేరాలతో పోలిస్తే సైబర్ నేరాల వల్ల దాదాపు ఏడు రెట్లు అధిక ఆర్థిక నష్టం జరుగుతోందని పేర్కొన్నారు.

**-కుటుంబాలను కుదేలు చేస్తున్న సైబర్ మోసాలు**

సైబర్ నేరాల వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా కుదేలవుతున్నాయని డీజీపీ సి.విఆనంద్ ఆందోళన వ్యక్తం చేశారు. జీవితాంతం కూడబెట్టుకున్న పొదుపులను క్షణాల్లో కోల్పోతున్న బాధితుల సంఖ్య పెరుగుతోందని చెప్పారు. ముఖ్యంగా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్లు,ఆన్‌లైన్ ట్రేడింగ్ స్కామ్‌లు,డిజిటల్ ఫైనాన్షియల్ మోసాలు వేగంగా పెరుగుతున్నాయని, వీటిని ఇప్పుడే సమర్థంగా నియంత్రించకపోతే భవిష్యత్‌లో మరింత తీవ్రమైన పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి పోలీసు అధికారి సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి పట్టు సాధించి,సైబర్ నేరాలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తెలంగాణను సాంకేతికత ఆధారిత సైబర్ పోలీసింగ్‌లో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని, వేగవంతమైన స్పందన, సమర్థవంతమైన దర్యాప్తు, ప్రజల్లో విస్తృత అవగాహనతో సైబర్ నేరాల నియంత్రణలో అగ్రస్థానాన్ని కొనసాగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**-ప్రజలకు పోలీసుల సూచనలు**

సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని తెలంగాణ పోలీసులు ప్రజలకు సూచించారు. ఓటీపీలు,పాస్‌వర్డ్లు,బ్యాంకు ఖాతా వివరాలు,ఇతర ఆర్థిక సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులతో పంచుకోవద్దని మరోసారి హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో డీజీపీ సి.వి. ఆనంద్,తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్,ఎస్పీలు హర్షవర్ధన్,సాయి శ్రీ, డీఎస్పీలు, సీఐలు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బిజినెస్

# ఉక్కు ఎగుమతులకు ఊతం

**ముంబై:**
భారత్-యూకే మధ్య స్వేచ్ఛా వాణిజ్యానికి ద్వారాలు తెరుచుకున్నాయి. సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) పేరుతో రెండు దేశాల మధ్య గత ఏడాది జూలై 24న కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఎఫ్‌టీఏతో మన దేశం నుంచి యూకేకు స్టీలు ఎగుమతులు భారీగా పెరగనున్నాయి. భారత్ నుంచి ఏటా 11 లక్షల టన్నులకు పైగా స్టీల్‌ను వివిధ కోటాల కింద జీరో డ్యూటీతో దిగుమతి చేసుకునేందుకు యూకే అంగీకరించింది. దీంతో ఈ ఏడాది మార్చి నుంచి యూకే అమలు చేస్తున్న స్టీల్ సేఫ్‌గార్డ్ చర్యల నుంచి భారత ఉక్కు తయారీ కంపెనీలకు పెద్ద ఊరట లభించిందని చెప్పవచ్చు. చైనా డంపింగ్‌తో అల్లాడుతున్న దేశీయ స్టీలు పరిశ్రమకు ఇది పెద్ద ఊరట.

**-దేశీయ తయారీకి ఊతం**

ఈ ఎఫ్‌టీఏతో బ్రిటన్ నుంచి మన దేశానికి పెట్టుబడులు వెల్లువెత్తుతాయని భావిస్తున్నారు. అదే జరిగితే దేశంలో తయారీ రంగం పుంజుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా పెరగనున్నాయి. ఈ ఒప్పందం ముఖ్యంగా వస్త్ర పరిశ్రమ, పాదరక్షలు, తోలు ఉత్పత్తులు, నగల తయారీ వంటి శ్రమ సాంద్రిత రంగాలకు మరింత మేలు చేయనుంది. ప్రస్తుతం భారత్-యూకే ద్వైపాక్షిక వాణిజ్యం 6,000 కోట్ల డాలర్లుగా ఉంది. ఎఫ్‌టీఏతో అది 10,000 కోట్ల డాలర్లకు చేరుతు ందని భారత పారిశ్రామిక వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.




**-బలపడనున్న పోటీ సామర్థ్యం**

ప్రస్తుతం యూకే మార్కెట్‌లో భారత కంపెనీలు చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, వియత్నాం వంటి దేశాలతో గట్టిగా పోటీపడాల్సి వస్తోంది. ఈ ఎఫ్‌టీఏతో మన వస్తు, సేవల ఎగుమతుల్లో 99 శాతం జీరో డ్యూటీ లేదా స్వల్ప సుంకాల పరిధిలోకి వస్తాయి. దాంతో యూకేకు జరిగే భారత వస్తు, సేవల ఎగుమతులు చైనా,పాకిస్థాన్, బ్రిటన్, వియత్నాం వంటి దేశాల ఉత్పత్తులకు గట్టి పోటీ ఇవ్వగలుగుతాయని భావిస్తున్నారు.

## నిమిషాల్లో గ్యాస్ సిలిండర్ డెలివరీ




**న్యూఢిల్లీ:**
ఆర్డరు చేసిన నిమిషాల్లోనే ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు తదితరాలను డెలివరీ చేస్తున్న స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ దేశంలోనే తొలిసారిగా వంట గ్యాస్ సిలిండర్ డెలివరీ సర్వీసుకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)తో జట్టుకట్టింది. ఈ సర్వీసు మొదటగా బెంగళూరులో అందుబాటులో ఉంటుంది. వినియోగదారులు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ద్వారా హెచ్‌పీసీఎల్ కొత్తగా విడుదల చేసిన హెచ్‌పీ నవ్య 10 కిలోల కాంపోజిట్ ఎల్‌పీజీ సిలిండంతోపాటు 5 కిలోల మెటల్ ఎల్‌పీజీ సిలిండర్‌ను ఆర్డర్ చేయవచ్చని కంపెనీలు తెలిపాయి. ఈ సిలిండర్లను కొనుగోలు చేయడానికి ఇప్పటికే గృహ ఎల్‌పీజీ కనెక్షన్ ఉండాల్సిన అవసరం లేదు. మొదటిసారి సిలిండర్‌ను కొనుగోలు చేసినప్పుడు కొత్త సిలిండర్ కొనుగోలుగా పరిగణిస్తారు. రీఫిల్ కోసం ఆర్డరు చేసినప్పుడు డెలివరీ సందర్భంగా ఖాళీ సిలిండర్‌ను తిరిగి ఇచ్చి నిండు సిలిండర్‌ను తీసుకోవచ్చు. మొదటిసారి ఆర్డరు చేసేటప్పుడు కస్టమర్లు తమ గుర్తింపు వెరిఫికేషన్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ సర్వీసు విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్, చిన్న కుటుంబాలకు ఉపయుక్తంగా ఉండనుంది.

# హార్మూజ్ జలసంధికి వెళ్లొద్దు-భారత నావికులపై కేంద్రం ఆంక్షలు



గల్ఫ్ ప్రాంతంలో భద్రతా పరిస్థితులు తీవ్రరూపం దాల్చడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకల్లో భారత నావికులను తదుపరి ఆదేశాలు జారీ చేసేంత వరకు నియమించవద్దని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మారిటైమ్ అడ్మినిస్ట్రేషన్ (డీజీఎంఏ) స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నౌకల యజమానులు, షిప్ మేనేజర్లు, రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు (ఆర్‌పీఎస్ఎల్) ఈ నిబంధనను తక్షణమే పాటించాలని సూచించింది. ఈ వివాదాస్పద ప్రాంతంలో వాణిజ్య నౌకలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో భారత నావికుల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీజీఎంఏ తన అధికారిక సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ఇటీవల మొంబాసా బి, అల్ బహ్యా, జీఎఫ్ఎస్ గెలాక్సీ, ఎంటీ వెద్యాన్, అల్ రెకయ్యాత్ వంటి వాణిజ్య నౌకలపై జరిగిన దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, ఈ ప్రాంతంలో ప్రయాణించే నావికులకు, నౌకలకు ప్రమాదం గణనీయంగా పెరిగిందని తన ప్రకటనలో పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ముందు జాగ్రత్త చర్యగా ఈ ఆంక్షలు విధించినట్లు స్పష్టం చేసింది. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరడమే ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణం. ఇరాన్‌లోని సైనిక స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించడం, ప్రతిగా ఇరాన్ ఓడరేవులపై అమెరికా నౌకా దిగ్బంధనాన్ని తిరిగి విధించడంతో పరిస్థితి మరింత దిగజారింది. దీంతో ఇరాన్ కూడా తీవ్రంగా స్పందించింది. తాము అమెరికాతో జీవన్మరణ పోరాటం చేస్తున్నామని, తమ ప్రాంతంలో ఇంధన ఎగుమతులను అడ్డుకుంటామని హెచ్చరించింది. ఈ ఘర్షణ వాతావరణం ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే నౌకా రవాణా మార్గమైన హార్మూజ్ జలసంధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

# జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్- క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లిన భారత షట్లర్




ఇంటర్నెట్ డెస్క్: భారత స్టార్ షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో అద్భుత ప్రదర్శన కొనసాగిస్తూ.. క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ హాన్ యూ(చైనా)పై సింధు ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. ప్రస్తుతం పదో ర్యాంక్‌లో ఉన్న సింధు.. కేవలం 35 నిమిషాల్లోనే 21-16, 21-14 స్కోరుతో వరుస గేమ్‌ల్లో గెలిచి ప్రత్యర్థిపై సత్తాచాటింది. తొలి గేమ్‌లో ఆరంభంలో కాస్త వెనుకబడినప్పటికీ, మళ్లీ లయ అందుకుంది. ఆ తర్వాత వరుస పాయింట్లు సాధిస్తూ ఆధిపత్యం చెలాయించింది. ఇక.. రెండో గేమ్‌లో అయితే ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వకుండా రెచ్చిపోయిన భారత స్టార్ షట్లర్ 8-0 ఆధిక్యంతో మ్యాచ్‌ను పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకుని అలవోక విజయం సాధించింది. ఈ విజయంతో హాన్ యూపై సింధు తన హెడ్ టూ హెడ్ రికార్డును 8-1కు మెరుగుపరుచుకుంది. ఈ సీజన్‌లో సింధు నమోదు చేసిన అత్యుత్తమ విజయాల్లో ఇదొకటిగా నిలిచింది. ఇక.. క్వార్టర్ ఫైనల్లో సింధు జపాన్‌కు చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన్ నొజోమీ ఒకుహారాతో తలపడనుంది. టాప్ క్రీడాకారిణి ఆన్ సె-యంగ్(దక్షిణ కొరియా) గాయం కారణంగా టోర్నీ నుంచి వైదొలగడంతో ఒకుహారాకు వాకోవర్ లభించింది. ప్రస్తుతం.. టోర్నీలో మిగిలిన ఏకైక భారత ప్లేయర్ సింధు కావడంతో అభిమానుల ఆశలన్నీ ఆమెపైనే ఉన్నాయి.

# ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఉద్రిక్తతలు- అర్జెంటీనాపై ఫిఫా చర్యలు తీసుకుంటుందా




క్రికెట్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ ఎంత హై వోల్టేజ్‌గా సాగుతుందో, ఫుట్‌బాల్‌లో ఇంగ్లండ్, అర్జెంటీనాల మధ్య ఆట కూడా అంతే రసవత్తరంగా సాగుతుంది. ఈ రెండు దేశాల మధ్య 1982లో ఫాక్‌లాండ్ దీవుల కోసం 74 రోజుల పాటు యుద్ధం సాగింది. ఆ యుద్ధంలో చివరకు బ్రిటన్ పై చేయి సాధించింది. దీంతో బ్రిటన్‌తో అర్జెంటీనా సంధి కుదుర్చుకుంది. ఈ యుద్ధంలో ఇరు దేశాలకు చెందిన 900 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఆ దీవుల విషయంలో ఇప్పటికీ ఇరు దేశాల మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ దీవులను బ్రిటన్ వాసులు ఇంగ్లీష్‌లో 'ఫాక్‌లాండ్స్' అని పిలుస్తారు. అర్జెంటీనా మాత్రం 'లాస్ మాల్వినాస్' అని సంబోధిస్తుంది. ప్రస్తుతం ఆ దీవుల్లో బ్రిటన్ పరిపాలన కొనసాగుతోంది. మరోవైపు ఆ దీవులపై తమ సార్వభౌమాధికారాన్ని వదులుకోవడానికి అర్జెంటీనా అంగీకరించడం లేదు తాజాగా ఫిఫా ప్రపంచకప్-2026 సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ఇంగ్లండ్, అర్జెంటీనా జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై అర్జెంటీనా 2-1 తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ అనంతరం అర్జెంటీనా జట్టు సంబరాలు తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీశాయి. మ్యాచ్ ముగిసిన అనంతరం కొందరు అర్జెంటీనా ఆటగాళ్లు 'లాస్ మాల్వినాస్ అర్జెంటీనావే' అని రాసి ఉన్న బ్యానర్‌ను ప్రదర్శించడం తీవ్ర చర్చకు దారితీసింది. ఫిఫా స్టేడియాల్లో రాజకీయ, మతపరమైన లేదా వివాదాస్పద సందేశాలను ప్రదర్శించడం నిషేధం. ఈ నేపథ్యంలో అర్జెంటీనా ఆటగాళ్ల చర్యపై ఫిఫా క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు పలు నివేదికలు వెల్లడించాయి. అయితే ఇప్పటివరకు ఫిఫా అధికారికంగా ఎలాంటి శిక్షనూ ప్రకటించలేదుకాగా, మ్యాచ్ అనంతరం ఇంగ్లండ్, అర్జెంటీనా ఆటగాళ్ల మధ్య వాగ్వాదాలు, తోపులాటలు చోటు చేసుకున్నాయి . మ్యాచ్ విజయంతో సంబరాలు చేసుకుంటున్న అర్జెంటీనా ఆటగాడు బార్కో తలపై ఇంగ్లండ్ ప్లేయర్ జూడ్ కొట్టాడు. బార్కో ఏదో అనడం వల్ల జూడ్ కొటినట్టు సమాచారం. అనంతరం ఇరు దేశాల ఆటగాళ్లు ఒకరినొకరు తోసుకున్నారు.

## స్పోర్ట్స్

## వారిని నేల మీదకు దించాలి

## గంభీర్‌కు ఏబీ డివిల్లీర్స్ కీలక సూచన




ఇటీవలి యూకే పర్యటనలో టీమిండియా వరుసగా టీ-20 సిరీస్‌లను కోల్పోయిన నేపథ్యంలో కోచ్ గౌతమ్ గంభీర్‌కు దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు ఏబీ డివిల్లీర్స్ కీలక సూచన చేశాడు. ప్రస్తుతం టీమిండియాలో స్టార్లుగా చెలామణి అవుతున్న యువ ఆటగాళ్లను నేల మీదకు దించాలని సూచించాడు. లేకపోతే భారత క్రికెట్ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించాడువైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ వంటి అసాధారణ ప్రతిభ కలిగిన బ్యాటర్లు టీమిండియాలో ఉన్నారు. అయితే అంతర్జాతీయ క్రికెట్‌లో దీర్ఘకాలం రాణించాలంటే కేవలం ప్రతిభ సరిపోదు. క్రమశిక్షణ, మానసిక దృఢత్వం, సరైన మార్గదర్శకత్వం కూడా అవసరం. యువ ఆటగాడిని అతిగా పొగడకూడదు. అతడు ఇంకా నేర్చుకునే దశలో ఉన్నాడనే విషయాన్ని గుర్తుంచుకోవాలి' అని తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ డివిల్లీర్స్ పేర్కొన్నాడు. 'ఐపీఎల్‌లో ఎన్నో పరుగులు చేసిన ఆటగాళ్లను ఈ పరాజయాలు వాస్తవంలోకి తీసుకువస్తాయి . ఇది అంతర్జాతీయ క్రికెట్ అని వారు అర్థం చేసుకోవాలి. ఇక్కడ బలహీనతకు తావు లేదు. ఐపీఎల్‌లో, మనం పరుగులు చేయగలమని భావించే ఒకరిద్దరు బౌలర్లు ఎప్పుడూ ఉంటారు. అంతర్జాతీయ క్రికెట్‌లో దాక్కోవడానికి చోటు ఉండదు. కాబట్టి మీకు ఒకటి, రెండు కంటే ఎక్కువ గేర్లు అవసరం. మీరు ఎల్లప్పుడూ ఐదో గేర్‌లో బ్యాటింగ్ చేయలేరు' అని డివిల్లీర్స్ పేర్కొన్నాడు.

## డబ్బుల కోసమే సినిమాల్లోకి వచ్చా- ఒకప్పుడు కూలీ పని కూడా చేశా: విజయ్ సేతుపతి



సినిమా పరిశ్రమలో ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకుండా, కేవలం తన అద్భుత నటనతో 'మక్కల్ సెల్వన్' (ప్రజల నటుడు)గా ఎదిగిన విజయ్ సేతుపతి.. తమిళ, తెలుగు ప్రేక్షకులలో సంపాదించుకున్న గుర్తింపు ప్రత్యేకమైనది. ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో ఆయన తన చిన్ననాటి కష్టాలు, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల గురించి పంచుకున్న విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. "చిన్నప్పుడు మా కుటుంబం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉండేది. మా నాన్న మా కోసమే చాలా అప్పులు చేశారు. అవి తీర్చలేక సతమతమయ్యేవాళ్లం. కొన్నిసార్లు అప్పులవాళ్లు మా ఇంటిపైకి గొడవకు వచ్చేవారు. ఆ సమయంలో మా నాన్న ఒంటరిగా బాధపడకూడదని నేను ఎప్పుడూ ఆయన పక్కనే కూర్చునేవాడిని" అని సేతుపతి గుర్తుచేసుకున్నారు. ఎన్ని కష్టాలున్నా ప్రతిరోజు రాత్రి 9.30 గంటలకు నాన్న బుల్లెట్ బండిపై వస్తూ ఫ్రైడ్ రైస్ తెచ్చేవారని, కుటుంబమంతా కలిసి దాన్ని పంచుకుని తినే ఆ క్షణాలు తన జీవితంలో మర్చిపోలేని మధుర జ్ఞాపకాలని చెప్పారు. నటుడు అవ్వాలనేది విజయ్ సేతుపతి లక్ష్యం కాదట. కేవలం కుటుంబ బాధ్యతలు, డబ్బుల కోసమే ఆయన రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టారు. సినిమాల్లోకి రాకముందు ఆయన స్కూల్ రోజుల్లో కూలీ పనికి వెళ్లారు. ఆ తర్వాత రిటైల్ స్టోర్‌లో సేల్స్‌మ్యాన్‌గా, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో క్యాషియర్‌గా, ఫోన్ బూత్ ఆపరేటర్‌గా పనిచేశారు. ఆ తర్వాత దుబాయ్ వెళ్ళి అక్కడ అకౌంటెంట్‌గానూ ఉద్యోగం చేశారు. దుబాయ్ నుంచి ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత నాటక రంగానికి చెందినవారితో ఏర్పడిన పరిచయమే విజయ్ సేతుపతి జీవితాన్ని మలుపు తిప్పింది. మొదట్లో సినిమాల్లో చిన్న చిన్న క్యారెక్టర్లు చేస్తూ..

## యుద్ధభూమిలో ప్రభాస్ 'ఫౌజీ' విడుదల తేదీ వచ్చేసింది!

ప్రభాస్ అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'ఫౌజీ' సినిమా విడుదల తేదీ ఖరారైంది. ఒక పోస్టర్‌తోనే సినిమాపై అంచనాలను మరింత పెంచేశారు. యుద్ధభూమి నేపథ్యాన్ని చూపించిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చిత్ర బృందం ప్రకటించిన వివరాల ప్రకారం 'ఫౌజీ' ప్రపంచవ్యాప్తంగా 2026 డిసెంబర్ 3న విడుదల కానుంది. ప్రభాస్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం ప్రభాస్‌కు సంబంధించిన కొంత షూటింగ్ మాత్రమే మిగిలి ఉండగా, నిర్ణయించిన తేదీకే సినిమాను విడుదల చేయాలనే లక్ష్యంతో చిత్రీకరణ, పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త పోస్టర్‌లో ప్రభాస్ పూర్తిగా భిన్నమైన లుక్‌లో కనిపించారు. వర్షంలో తడిసిపోయి, రక్తపు మరకలతో, గాయాలతో యుద్ధభూమి మధ్య కూర్చున్న ఆయన చేతిలో తుపాకీ కనిపిస్తోంది. చుట్టూ మృతదేహాలు, శిథిలాలు కనిపించేలా పోస్టర్‌ను డిజైన్ చేశారు. 'ఒంటరిగా పోరాడే ఓ బెటాలియన్' అనే ట్యాగ్‌లైన్‌తో కథ యుద్ధం, త్యాగం, ధైర్యం చుట్టూ తిరగబోతుందనే సంకేతాలు ఇచ్చారు. పోస్టర్‌లో 'ఫౌజీ' టైటిల్‌ను ఎరుపు రంగులో ప్రత్యేకంగా చూపించారు. చారిత్రక నేపథ్యాన్ని సూచించేలా పాత ముద్రలు, సంఖ్యలు, చేతిరాత తరహా డిజైన్‌లను ఉపయోగించారు. దీంతో సినిమా ఏ కాలంలో సాగుతుందనే ఆసక్తి మరింత పెరిగింది. అయితే కథకు సంబంధించిన పూర్తి వివరాలను చిత్ర బృందం ఇంకా వెల్లడించలేదు. ఈ చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రభాస్‌తో ఆయన చేస్తున్న తొలి సినిమా ఇదే. ఇమాన్వీ, మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. విడుదల తేదీ పోస్టుకు కొన్ని నిమిషాల్లోనే వేలాది లైక్‌లు, కామెంట్లు వచ్చాయి. ప్రభాస్ కొత్త అవతారం, సినిమా నిర్మాణ స్థాయిపై అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి





## నోలన్ 'ది ఒడిస్సీ' సినిమాకు వెళుతున్నారా? అరగంట ముందే థియేటర్‌కు చేరుకోండి!

ప్రఖ్యాత హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించిన 'ది ఒడిస్సీ' చిత్రం కోసం సినీ ప్రేక్షకులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం శుక్రవారం (జులై 17) విడుదల కానుంది. అయితే, సినిమా వీక్షించేందుకు వచ్చే ప్రేక్షకులు, మరీ ముఖ్యంగా ఐమ్యాక్స్ స్క్రీన్‌లలో చూసేవారు, కనీసం 30 నిమిషాల ముందే థియేటర్లకు చేరుకోవాలని చిత్ర బృందం సూచించింది. ఈ చిత్రాన్ని సంపూర్ణంగా అధునాతన ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరించారు. ప్రేక్షకులకు అద్భుతమైన దృశ్యానుభూతిని అందించే క్రమంలో, కొన్ని ఎంపిక చేసిన ఐమ్యాక్స్ 70ఎంఎం స్క్రీనింగ్‌లలో ప్రధాన చిత్రం ప్రారంభానికి ముందు ప్రత్యేక కంటెంట్‌ను ప్రదర్శించే అవకాశం ఉంది. దీనిలో భాగంగా, డెనిస్ విల్లేనువే దర్శకత్వంలో రాబోతున్న 'డూన్: పార్ట్ త్రీ' చిత్రానికి సంబంధించిన నాలుగు నిమిషాల ప్రోలోగ్‌ను ప్రదర్శించవచ్చని ప్రచారం జరుగుతోంది. గతంలోనూ నోలన్ తన 'ది డార్క్ నైట్', 'ది డార్క్ నైట్ రైజెస్' చిత్రాల ప్రమోషన్ కోసం ఇదే తరహా వ్యూహాలనే అనుసరించడం గమనార్హం. సాధారణంగా భారీ చిత్రాల విడుదల సమయంలో తలెత్తే ట్రాఫిక్ ఇబ్బందులు, టికెట్ స్కానింగ్ ప్రక్రియ మరియు రద్దీగా ఉండే హాల్స్‌లో సీట్లను వెతుక్కోవడం వంటి కారణాల వల్ల ప్రేక్షకులకు ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో నిర్ణీత సమయం కంటే ముందుగానే థియేటర్‌లకు చేరుకోవడం ఉత్తమమని విశ్లేషకులు సూచిస్తున్నారు.



## 'ది కాల్' (జియో హాట్ స్టార్)మూవీ రివ్యూ!

హారర్ థ్రిల్లర్ సినిమాలకు ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ పై ఎప్పుడూ మంచి ఆదరణ లభిస్తూ ఉంటుంది. ఈ జోనర్ నుంచి వచ్చిన సినిమాలను భాషతో సంబంధం లేకుండా ఆడియన్స్ చూస్తుంటారు. అందువల్లనే ఈ జోనర్ సినిమాలను ఎక్కువగా వదలడానికి ఓటీటీ సంస్థలు పోటీపడుతూ ఉంటాయి. అలా రూపొందిన సినిమానే 'ది కాల్'. 2020 నవంబర్లో విడుదలైన ఈ సౌత్ కొరియన్ సినిమా, ఆ తరువాత ఓటీటీ సెంటర్లలోకి అడుగుపెట్టింది. అయితే తాజాగా 'జియో హాట్ స్టార్' లో తెలుగులోను అందుబాటులోకి వచ్చింది. ఈ నెల 10వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. అది సిటీకి దూరంగా ఉన్న ఒక మారుమూల గ్రామం. అక్కడ ఎడిత్ క్రాన్స్ టన్ (లిన్ షేయ్) అనే ఒక వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తూ ఉంటుంది. క్రాన్స్ భర్త ఎక్కువగా ట్రావెలింగ్ లో ఉండటం వలన, ఆమె భయపడుతూనే రోజులు గడుపుతూ ఉంటుంది. ఆమె రూపం.. చిత్రమైన ధోరణి కారణంగా మంత్రగత్తె అనే ఒక పేరు పడిపోతుంది. కొంతమంది ఆకతాయిలు ఆమెను మరింత ఇబ్బందిపెడుతూ ఉంటారు. తన చెల్లెలు 'లారా' కనిపించకపోవడానికి క్రాన్స్ కారణమని 'తానియా' భావిస్తుంది. ఆమెనే లారాను ఏదో చేసి ఉంటుందని ప్రచారం చేస్తుంది. తన స్నేహితులైన క్రిస్ .. బ్రెడ్ .. జాక్ తో కలిసి క్రాన్స్ ఇంటిపైకి వెళుతుంది. రాళ్లు విసురుతూ ఆమె ఇంటి అద్దాలను పగులగొడతారు. ఆ తరువాత ఆమె చనిపోయిందని తెలుసుకుని వాళ్లంతా ఆశ్చర్యపోతారు. ట్రావెలింగ్ నుంచి వచ్చిన క్రాన్స్ భర్త, ఆ నలుగురు స్నేహితులను తన ఇంటికి పిలిపిస్తాడు. తన భార్య ఆత్మ హత్య చేసుకుందనీ, ఆమె బాడీతో పాటు ఫోన్ ను కూడా ఖననం చేశానని చెబుతాడు. తన ఇంట్లోని మేడ పై గదిలోకి ఒక్కొక్కరుగా వెళ్లి, ఆ నెంబర్ కి కాల్ చేసి ఒక నిమిషం మాట్లాడమని కోరతాడు. నిమిషం పాటు మాట్లాడినవారికి, పెద్ద మొత్తంలో నగదు బహుమతిని అందజేస్తానని చెబుతాడు. అలా చేయకపోతే తన భార్య రాసిన సూసైడ్ లెటర్ ను పోలీసులకు అందజేస్తానని బెదిరిస్తాడు. దాంతో అతను చెప్పినట్టుగా చేయడానికి వాళ్లు అంగీకరిస్తారు. ఒక్కొక్కరుగా మేడపైకి వెళతారు. అక్కడ ఏం జరుగుతుంది? వెళ్లినవాళ్లు తిరిగొస్తారా లేదా? అనేది మిగతా కథ. ఆత్మహత్య చేసుకున్నవాళ్లు దెయ్యాలుగా మారతారా? బ్రతికున్నపుడు తమని అదే పనిగా వేధిస్తూ వచ్చినవాళ్లపై ప్రేతాత్మలు పగబడతాయా? అలాంటివాళ్లపై ప్రతీకారం తీర్చుకుంటాయా? అనే ప్రశ్నలకు సమాధానంగా ఈ సినిమా కథను అల్లుకున్నారు. ఆకతాయి చేష్టలతో తనని వేధించిన ముగ్గురు యువకులు .. ఒక యువతిపై ఒక ప్రేతాత్మ ఎలా ప్రతీకారం తీర్చుకుంటుంది? అనే అంశం చుట్టూనే ఈ కథ తిరుగుతుంది. వృద్ధురాలు చనిపోవడం .. ఆమె ఆత్మహత్యకు కారకులైన నలుగురు ఫ్రెండ్స్ ను ఆమె భర్త పిలిపించడం .. వాళ్లకి ఒక టాస్క్ ఇవ్వడం వరకూ ఈ కథ ఇంట్రెస్టింగ్ గానే అనిపిస్తుంది. ఇక ప్రేతాత్మతో ఫోన్లో మాట్లాడటానికి ఒక్కొక్కరూ మేడపైకి వెళుతుంటే, అసలు కథ మొదలైందనే ఒక కుతూహలం పెరుగుతూ పోతుంది. అయితే ఆ క్యూరియాసిటీ ఎంతోసేపు నిలబడదు. ఎందుకంటే ఆడియన్స్ భయపడేంత స్థాయిలో అక్కడ ఏమీ జరగదు. మేడపైకి వెళ్లిన వాళ్లు ఒక ప్రత్యేకమైన జోన్ లోకి వెళ్లిపోవడం వరకూ బాగానే ఉంది. అయితే అక్కడ లైటింగునుగానీ, ప్రేతాత్మకి సంబంధించిన జుగుప్సాకరమైన సన్నివేశాలనుగాని చూడలేము. భయంతో ముచ్చెమటలు పట్టేంత సీన్ .. అక్కడ ఏ సీన్ కి లేదు. మొబైల్ ను శవంతో పాటు పెట్టేసి పూడ్చేయడం, ఆ నెంబర్ కి కాల్ చేస్తే ప్రేతాత్మ మాట్లాడటం వంటి సన్నివేశాలు చాలా సిల్లీగా అనిపిస్తాయి. సాధారణంగా దెయ్యాల కథలన్నీ దాదాపు ఒక ఇంటిపరిమితమవుతూ ఉంటాయి. ఆ ఇంటి గేటుదాటి దెయ్యాలు బయటికి రావు. బయట పాత్రలు లోపలికి వెళతాయి అంతే. పైగా ఈ తరహా కథలకు పెద్దగా తారాగణం అవసరం లేదు. చాలా తక్కువ మందితో .. తక్కువ బడ్జెట్ లో కానిచ్చేస్తూ ఉంటారు. అలాంటి ఒక కాన్సెప్ట్ తో రూపొందిన సినిమానే ఇది. ఒక్కమాటలో చెప్పాలంటే రియాలిటీ షోను గుర్తుకు చేసే కంటెంట్ ఇది. ఆర్టిస్టుల నటన గురించి గొప్పగా చెప్పుకోవడానికేమీ లేదు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. హారర్ సినిమాలను ఇష్టపడే ఆడియన్స్ కి చాలా సాధారణంగా అనిపించే కాన్సెప్ట్ గా ఈ సినిమా మిగిలిపోతుందని చెప్పొచ్చు.




PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.